
ఆదివారం
వార్త
11 ఫిబ్రవరి 2024
దూరపు
చదువులు మెరుపు

# పోలీస్ ఆఫీసర్‌గా ఊర్వశి రౌతేలా?



బాలీవుడ్‌లో హాట్ బ్యూటీగా ఊర్వశి రౌతేలాకి మంచి క్రేజ్ వుంది. హీరోయిన్ గా చేసిన ప్పటికీ స్పెషల్ సాంగ్స్ ఆమెకి ఎక్కువగా గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఊర్వశి మంచి డాన్సర్. తెలుగులో 'వాల్తేర్ వీరయ్య', 'ఏజెంట్', 'బ్రో', 'స్కంద' సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది.
తాజా సమాచారం ప్రకారం బాలకృష్ణ-బాబీ కాంబినేషన్‌లోని సినిమాలో ఒక హీరోయిన్‌గా ఊర్వశి రౌతేలా కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో ఆమె పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుందట. సితార బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం సమకూరుస్తున్నారు.

## తారాతీరం

# మరో తెలుగు సినిమాలో హీరోగా విజయ్!



విజయ్‌కి తమిళనాట విపరీతమైన క్రేజ్ ఉంది. ఇక తెలుగులోను ఆయన సినిమాల మార్కెట్ పెరిగింది. తెలుగులో నేరుగా చేసిన 'వారసుడు' సినిమా తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదలైంది. ఈ నేపథ్యంలో విజయ్ మరో తెలుగు సినిమా చేయడానికి అంగీకరించినట్లు సమాచారం. 'ఆర్ఆర్ఆర్' చిత్రం నిర్మించిన డీవీవీ దానయ్య నిర్మాణంలో రూపొందించనున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా ప్లాన్ చేస్తున్నారట. ఈ ఏడాదిలోనే ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించే ఆలోచన చేస్తున్నట్లు వినికిడి. అయితే మరోవైపు విజయ్ రాజకీయాల దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు ఎంత వేగంగా ముందుకు వెళుతుందనేది వేచి చూడాలి మరి.

ఆదివారం వార్త

11 ఫిబ్రవరి, 2024

## మంచి ముత్యాలు

ఈ ప్రపంచం నీకు ఏమి యిచ్చిందనే విషయాన్ని వదిలివేసి, ఈ ప్రపంచానికి నీవు ఏమి యిస్తున్నావనే విషయాన్ని గురించి ఆలోచించు, అప్పుడు నీ జీవితానికి సార్థకత చేకూరుతుంది.

హెచ్.డబ్ల్యూ.బీచర్

## విషయ విశేషం


గుండెను బరువెక్కించే ఉత్తరం... 4

'సంఘీ'భావం....5

చిన్నారులకు గంజాయి చాక్లెట్లు

కవర్ స్టోరీ..6

దూరపు చదువులు మెరుపు

ఇకపై మొబైల్ ఫోనే టీవీ...10

ఈవారం కవిత్వం..12

ప్రణయ నాదం

చీకట్లోనూ స్పష్టంగా చూపిస్తుంది..14

ప్రేమను ప్రేమించు.....18

కథ.. 20

బుల్లెట్ బండారం

సాహిత్యం..24

'కొడవటిగంటి' సాహితీ ప్రయోజనం

ఏదీ ప్రాధాన్యం?..25

నుయ్యి ఎటువైపు తవ్విస్తే మంచిది?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### రెండుసార్లు బ్రష్ మంచిదే



రోజుకి రెండుసార్లు బ్రష్ చేయడం మంచిదని మనందరికీ తెలుసు. కానీ, అది కేవలం దంతాల ఆరోగ్యం కోసం మాత్రమే కాదు. ఈ అలవాటుకీ గుండె ఆరోగ్యానికి దగ్గర సంబంధం ఉందని ఇప్పటికే అధ్యయనాలు నిరూపించాయి. తాజాగా ఈ అలవాటు న్యుమోనియా లాంటి ఊపిరితిత్తుల సమస్యలూ రాకుండా అడ్డుకుంటోందని ఓ అధ్యయనం చెబుతోంది. మామూలు రోజుల్లో ఎలా ఉన్నా ఆసుపత్రిలో ఉన్నవాళ్లూ, వాళ్లకి సాయంగా వెళ్లినవాళ్లూ దీన్ని తప్పనిసరిగా పాటించాలంటోంది. ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్న ప్రతి రెండొందల మందిలో ఒకరికి న్యూమోనియా సోకుతున్నట్టు అమెరికాలోని బోస్టన్ బ్రిగామ్ అండ్ విమెన్స్ హాస్పిటల్‌కి చెందిన వైద్యులు గుర్తించారు. ముఖ్యంగా ఉబ్బసం వంటి శ్వాససంబంధిత ఇబ్బందులతో చేరినవాళ్లలో న్యుమోనియా కేసులు పెరగడం చూశారు. మామూలుగా నోటి ద్వారానే ఈ బ్యాక్టీరియా వెళ్లే అవకాశం ఉంది కాబట్టి రోజుకి రెండుసార్లు బ్రష్ చేయడం ద్వారా దీన్ని అడ్డుకోవచ్చని శాస్త్రీయంగా నిరూపించారు వైద్యులు.

### జోక్స్..జోక్స్..

రామానందం: ప్రతి రైలూ లేటుగా వస్తే ఈ పనికిమాలిన టైంటేబుల్ ఇక్కడెందుకు?' రైల్వే అధికారితో పేచీ పెట్టుకున్నాడు రామానందం.

రైల్వేఅధికారి: ప్రతి రైలూ కరెక్టు టైంకు వస్తే నీవు విశ్రాంతి తీసుకుంటున్న ఈ వెయింటింగ్ రూంలు ఎందుకు? మరింత మిర్రిగా చూస్తూ అన్నాడు..

...

రాము: నీ చెప్పుల జత ఒకటి ఎర్రరంగులో, మరొటి పచ్చరంగులో భలే వింతగా ఉందేంటి?

గోపి: అచ్చం ఇలాంటి వింత జతే మా ఇంట్లో మరోటి ఉంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# గుండెను బరువెక్కించే ఉత్తరం

విశ్వంలో అమ్మ ప్రేమకు మించిన ప్రేమ దొరకదు. ఆ ప్రేమకు మరో ప్రత్యామ్నాయం లేదు. తన ప్రాణాలు పోతున్నా కూడా బిడ్డ క్షేమం గురించే ఆలోచిస్తుంది. ఈ విషయం అనేకసార్లు రుజువైంది. తాజాగా కేన్సర్‌తో చనిపోతూ తన కుమారుడికి రాసిన ఒక లేఖ ఇంటర్నెట్‌లో సంచలనంగా మారింది. పలువురి చేత కన్నీళ్లు పెట్టిస్తోంది. రెడ్డిట్ యూజర్ మాట్ గాల్డ్ కేన్సర్‌తో చనిపోవడానికి ముందు తన తల్లి రాసిన ఒక లేఖను పోస్ట్ చేశారు. చనిపోతానని తెలిసి తన కొడుకుపై ప్రేమను, తన బాధను ఈ లేఖలో వ్యక్తీం చేసింది ఆ మాతృమూర్తి. 'కన్నా నేను చనిపోతానన్న బాధకన్నా, నిన్ను విడిచి వెళ్లాలన్న ఆలోచనల నా ప్రాణాల్ని తోడేస్తోంది. నా తరువాత నిన్ను ఎవరు చూసుకుంటారు అనేదే ఎక్కువ బాధగా ఉంది. ఏదో ఒకరోజు నీకు ఇది దొరుకుతుందనే ఆశతో ఈ ఉత్తరం రాస్తున్నాను. నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలుసని ఆశిస్తున్నాను. నువ్వు నా బంగారు కొండవి. మరే ఆదాయం రాదని తెలిసినా నాకోసం ఉద్యోగం మానేసి మరీ ఎంతో సేవ చేసావ్. నీతో గడిపిన ప్రతీక్షణం చాలా అద్భుతం. ఎప్పుడూ నీతోనే రా..నాన్నా. ఆ పైనుంచి నిన్ను చూస్తూనే ఉంటాను కన్నా.' అంటూ మాట్ గాల్డ్ చేసిన త్యాగాలకు ధన్యవాదాలు తెలుపుతూ ఆమె రాసిన లేఖ నెటిజన్లు భావోద్వేగానికి లోను చేసింది. 'ప్రతి రోజూ అమ్మను మిస్ అవుతున్నా.. ఏడుపొ స్తోంది. కానీ చిరునవ్వు మధ్య ఆ బాధనంతా దిగమింగు తున్నాను. ఎందుకంటే నాన్న కూడా కేన్సర్‌తో బాధపడుతూ ఐసీయూలో ఉన్నారు. ఆయన్ని చూసుకోవాలి' అంటూ మాట్ గాల్డ్ రెడ్డిట్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. దీంతో నెటిజన్లు సారీ బ్రో అంటూ కమెంట్ చేశారు. తల్లీ కొడుకుల అనుబంధం ఎప్పటికీ శాశ్వతమే అని అంటూ వ్యాఖ్యానించారు.

# ప్రేమ గుడ్డిది కాదు

ప్రేమ గుడ్డిదని ప్రపంచమంతా ఒప్పుకుంటుంది. ఎంత మేధావులైనా సరే– ప్రేమలో పడ్డాక తర్కం పని చేయదు. ఆక్సిటోసిన్, డోపమైన్, వాసోప్రెసీన్ వంటి హార్మోన్‌లే ఇందుకు కారణమని ఇదివరకే నిరూపించారు కూడా. కానీ ఈ హార్మోన్‌లు మెదడుపైన ఎలా పనిచేస్తాయి? అన్నదానిపైన ఓ స్పష్టత లేదు ఇప్పటిదాకా. ఆస్ట్రేలియా నేషనల్ వర్సిటీ పరిశోధకులు ఆధునిక పద్ధతులతో ఆ స్పష్టత తెచ్చే ప్రయత్నం చేశారు. అదేమిటంటే..మన మెదడులో 'బిహేవి యర్ యాక్టివేషన్ సిస్టమ్' (బీఏఎస్) అన్న వ్యవస్థ ఉంటుంది. 'మనం ఫలానా పనిచేస్తే మంచిది.. జీవితంలో ముందుకొస్తాం, మంచి పేరు తెచ్చుకుంటాం' అనుకుని మనం కొన్ని అలవాట్లు చేసుకుంటాం. మనం అలా మంచిగా ఉండటానికి ఈ బీఏఎస్ అన్న వ్యవస్థే కారణం. కానీ ప్రేమించేటప్పుడు విడుదలయ్యే హార్మోన్లు బీఏఎస్‌ని పూర్తిగా తమ గుప్పెట్లోకి తీసుకుంటాయట. దాని తీరుని ఒక్కసారిగా మార్చేస్తాయట. శరీరంలోని నాడీవ్యవస్థ మొత్తం ఆక్సి టోసిన్‌లూ, డోప మైన్‌లూ నిండి పోతాయట. దాంతో మనం ఏమీ చేయకుండానే ఏదో గొప్ప విజయం సాధించినట్టు 'బీఏఎస్' భ్రమిస్తుందట. ప్రియుడో ప్రియురాలో వాళ్లంటే ప్రాణం పెట్టడానికి ఇదే కారణమంటున్నారు.



'సంఘీ' భావం



# చిన్నారులకు గంజాయి చాక్లెట్లు

**గంజాయి** వాడకం గత నాలుగు సంవత్సరాలతో పోలిస్తే మూడింతలు పెరిగింది. చాటుమాటుగా సాగే గంజాయి అమ్మకాలు ప్రస్తుతం వ్యవస్థీకృతంగా మారాయి. కొందరు రాజకీయ నాయకుల నుంచి పోలీసుల వరకు ఈ వ్యవస్థలో భాగస్వాములుగా మారారు. గతంలో అంతగా చదువు లేని వారు, కూలీనాలీ పనులతో జీవనం సాగించే వారు గుట్టుగా గంజాయిని సేవించే వారు. ఆ తరువాత క్రమంగా సిగరెట్ల రూపంలో విద్యాసంస్థలకు, పబ్‌లకు చేరింది. ప్రస్తుతం ఏకంగా స్కూలు పిల్లలకు కూడా అందుబాటులోకి వచ్చింది. చిన్నపిల్లల కోసం ఏకంగా చాక్లెట్లలో గంజాయిని జోడించి పాఠశాలల మెయిన్ గేటు వద్దకే వెళ్లి విక్రయించడం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని శివారు ప్రాంతంలో ఉన్న ఒక పాఠశాలలో కొందరు విద్యార్థులు విచిత్రంగా వ్యవహరించడం, తన మాటను ఖాతరు చేయకపోవడం వంటి మార్పులను గమనించిన ఉపాధ్యాయుడు ఈ విషయాన్ని ప్రిన్సిపాల్‌తో చర్చించాడు. విచిత్రంగా వ్యవహరిస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా గమనించిన ప్రిన్సిపాల్ వారిలో స్పష్టమైన తేడాను గమనించారు. మత్తులో వారు తూలుతున్న విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలో దిగిన పోలీసుల దర్యాప్తులో గంజాయి చాక్లెట్ల విషయం వెలుగు చూసింది. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు గంజాయి చాక్లెట్లకు అలవాటు పడ్డారని తెలుసుకుని అవాక్కయ్యారు. ప్రతిరోజు గంజాయి చాక్లెట్ తినకపోతే తట్టుకోలేని విధంగా విద్యార్థులు మానసికంగా దిగజారిపోయారు. విద్యార్థులకు వైద్య చికిత్సలు అందించారు. పోలీసులు దర్యాప్తును కొనసాగించి గంజాయి చాక్లెట్ల గుట్టును రట్టు చేశారు. ఒడిశాలో గంజాయి చాక్లెట్ల తయారీ జోరుగా సాగుతోంది. ఇక్కడ నుంచి పెద్ద సంఖ్యలో గంజాయి చాక్లెట్లు రాష్ట్ర సరిహద్దులు దాటి దేశవ్యాప్తంగా విక్రయాలు సాగిస్తున్నాయి. గతంలో గంజాయి నేరుగా బీడి ఆకుల మాదిరిగా విక్రయించే వారు. ఆ తరువాత పొడి చేసి బస్తాల్లో నింపి సరఫరా చేసే వారు. ఆ తరువాత గంజాయి సిగరెట్లు తయారు చేసి కళాశాలలకు, పారిశ్రామిక వాడలకు తరలించే వారు. కొంతకాలం గంజాయి నూనె కూడా విక్రయించారు. మార్కెట్‌ను విస్తరింపచేయడానికి ప్రస్తుతం ఏకంగా చిన్నారులను లక్ష్యంగా చేసుకుని గంజాయి చాక్లెట్లను మార్కెట్‌లో దింపారు. చిన్నచిన్న కిరాణా షాపుల నుంచి మోస్తారు రిటైల్ మార్ట్‌ల వరకు ఈ చాక్లెట్లను సరఫరా చేస్తున్నారు. సాధారణ చాక్లెట్ల సీసాల పక్కనే ఇవి ఉండటంతో ఎవరికీ అనుమానం రావడం లేదు. సాధారణ చాక్లెట్ల్ కోసం వచ్చే విద్యార్థులకు మెల్లిగా ఈ గంజాయి చాక్లెట్లు అందిస్తున్నారు. వాటిని తిన్న పిల్లలు మత్తుకు లోనౌతున్నారు. మొదట్లో కంగారు పడినా క్రమంగా ఈ మత్తుకు అలవాటు పడుతున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఈ చాక్లెట్లు విక్రయాలు జరుగుతున్నాయి. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాలో గంజాయి సాగు విపరీతంగా ఉంటుంది. అదేవిధంగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం మన్యం ప్రాంతంలో కూడా గంజాయి సాగు పెరిగింది. ఇక శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో మిర్చిపంటలోనే గంజాయిని సాగుచేస్తున్నారు. మిర్చి పంట, గంజాయి మొక్కకు దగ్గర పోలికలు ఉండటంతో వాటిని గుర్తించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కరోనా తరువాత గంజాయిసాగు ఎక్కువగా జరుగుతోంది. ప్రస్తుతం గంజాయిని ఎక్కువగా ఒడిశాకు పంపించి అక్కడ చాక్లెట్ల రూపంలో వాటిని మార్చిన తరువాత రైళ్లలోను, రోడ్డు మార్గం ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారు. ఒక్కొక్క చాక్లెట్ సుమారు 5 గ్రాములు వరకు ఉంటుంది. 40 చాక్లెట్లు ఒక ప్యాకెట్‌గా తయారు చేస్తున్నారు. వీటిని 90 రూపాయలకు కొనుగోలు చేసి రెండు నుంచి నాలుగు వందల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లో బస్సులను తనిఖీ చేసినప్పుడు గంజాయి చాక్లెట్లను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి పెద్ద సంఖ్యలో గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి వివిధ మార్గాల్లో తెలుగు రాష్ట్రాల్లోకి గంజాయి చాక్లెట్లు తరలిస్తున్నారు. గంజాయి బస్తాలను, సిగరెట్లను గుర్తించినంత సులువుగా గంజాయి చాక్లెట్లను గుర్తించలేకపోతున్నట్లు పోలీసు, ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. గంజాయి చాక్లెట్లను విక్రయిస్తే ఎక్కువ లాభం రావడంతో విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న కొన్ని దుకాణాల నిర్వాహకులు వీటిని విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. పట్టుబడిన వారి నుంచి కీలక సమాచారం కూడా అందడం లేదు. లింక్ చైన్ విధానాన్ని ఎక్కడికక్కడ నిలిపివేస్తుండటంతో దర్యాప్తు ఒక పరిధి దాటడం లేదు. గంజాయి చాక్లెట్ల వ్యవహారాన్ని మరింత సమర్థవంతంగా ఎదుర్కోవడానికి మరికొంత సమయం అవసరమని పోలీసులు చెబుతున్నారు. కాగా ఈ సమస్యను ఎదుర్కోవడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. చాక్లెట్లు తరచూ కొంటూ ఉంటే వాటిని పరిశీలించాల్సి న అవసరం ఉంది. మత్తుకు అలవాటు పడుతున్నట్లు తల్లిదండ్రులు గుర్తించిన వెంటనే ఆ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. పిల్లలను కూడా ఈ విషయంపై అవగాహన కల్పించాలి. పాఠశాలలో తోటి విద్యార్థుల ప్రవర్తనలో అనుమానం కలిగితే వెంటనే సమాచారాన్ని తెలుసుకుని వారి తల్లిదండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం ఇవ్వవలసి ఉంటుంది. అప్పుడే గంజాయి చాక్లెట్ల ప్రమాదం నుంచి చిన్నారులను కాపాడుకునే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# దూరపు చదువులు మెరుపు

**విదేశాల్లో చదువుకోవాలనే చాలా మంది భారతీయ విద్యార్థుల కల. ఇటీవలి సంవత్సరంలో అధిక సంఖ్యలో భారతీయ విద్యార్థులు తమ ఉన్నత విద్యను అభ్యసించడానికి విదేశాలకు క్యూ కడుతున్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలలో చదువుకోవాలనే తపన, భారతదేశంలో యువతను ఆకర్షిస్తోంది.**

కవర్ స్టోరీ

ఎం.వెంకటేశ్వర రావు

విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడటానికి కారణాలు ఏమిటి?
2017 నుండి దాదాపు 30.13 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశీ ఉన్నత విద్యను అభ్యసించారని కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది.
కారణాలు పరిశీలిస్తే నాణ్యమైన విద్య, బోధన, మెరుగైన కోర్సులు, అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలు, పని అవకాశాలు ఎక్కువగా ఉండటం, దీర్ఘకాలిక పోస్ట్ స్టడీ వీసా అవకాశాలు, గ్లోబల్ జాబ్ మార్కెట్, శాశ్వత నివాస వసతి, హార్వర్డ్, ఎమ్ఐటి, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫోర్డ్, కేంబ్రిడ్జ్ వంటి విశ్వవిద్యాలయాల్లో సాటిలేని విద్య, పరిశోధన అవకాశాలు అందిస్తుండటంతో భారతీయ విద్యార్థులు ఆకర్షితులవుతారు.
నేడు భారతీయ విద్యార్థులు విదేశాలలో విద్యనభ్యసించడానికి ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. ఎందుకంటే విదేశాలలో విద్యా విధానం భారతదేశం కంటే ఎంతో అభివృద్ధి చెందింది.
విదేశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు భారతదేశంలో విస్తృతంగా అందుబాటులో లేవు.
విదేశాలలో విద్య వలన విద్యార్థులలో సామర్థ్యం పెంచుకోవడానికి ఒక సాధనంగా మారుతోంది. అలాగే విదేశాలలో ఉద్యోగావకాశాలు, ఆర్థికంగా అధిక మొత్తంలో వేతనాలు, విద్యార్థుల్ని విదేశీ విద్య, ఉద్యోగాల వైపు ఆలోచించేలా చేస్తున్నాయి.
భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ఎంపిక చేసుకునే ప్రధాన కారణాలు మూడు.

1. నాణ్యమైన విద్య

భారతదేశంలోనూ విద్యా ప్రమాణాలు పెరుగుతున్నప్పటికీ అందుబాటులో ఉన్న కోర్సులు పరిమితంగా ఉంటున్నాయి. అవి కూడా కేవలం థియరీ వరకే పరిమితమవుతున్నాయి. ప్రాక్టికాలిటీ లోపించడం వలన, గ్రాడ్యుయేట్ అయిన విద్యార్థులకు ఉద్యోగానికి కావల్సిన నైపుణ్యాలు లేకపోవటం వలన కెరీర్ పరంగా ఆటంకాలు ఎదుర్కొంటున్నారు.



మన దేశంలో విద్యను విదేశీ విద్యతో పోల్చి చూస్తే విదేశాలలో ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలలు తమ విద్యార్థులను థియరీ, ప్రాక్టికాలిటీ మధ్య సమతుల్యత ఉండేట్టు విద్యా విధానం ఉంటుంది.

విదేశాల్లో విద్యా వ్యవస్థలో విద్యార్థుల ఆసక్తికి తగిన విధంగా కోర్సును ఎంపిక చేసుకోవడానికి, పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసుకుని, సెల్ఫ్ సపోర్టివ్‌గా ఉండేందుకు అనుమతించే కోర్సులు ఎక్కువగా ఉంటాయి. దాని వలన విద్యార్థులు చదువుకుంటూనే సంపాదించుకునే సౌలభ్యం ఉంటుంది. విదేశాల్లో విశ్వవిద్యాలయాలు తమ పూర్వ విద్యార్థులతో ఒక బలమైన నెట్‌వర్క్ ఉంటుంది. అది గ్లోబల్ కంపెనీలతో అనుసంధానమై ఉంటుంది. ఇవి తమ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఉద్యోగాలను, ఉపాధి అవకాశాలను కల్పించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.



విదేశాల్లో సాంకేతిక అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు ఎక్కువగా ఉంటుంది. ఇది విద్యార్థులలో వారి వారి నైపుణ్యాలకు పదును పెట్టి, నూతన ఆవిష్కరణలు చేయడానికి అవకాశాలు ఎక్కువగా కల్పిస్తుంది. తమను తాము సవాలు చేసుకోవడానికి, విభిన్న ఆలోచనలకు రూపకల్పన చేసుకోవడానికి ప్రోత్సహిస్తోంది.

విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు స్కాలర్‌షిప్ అవకాశాలను కల్పిస్తోంది. విద్యార్థులు చేసే కోర్సులకు తగినట్టు వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నాయి.

**ఉపాధి అవకాశాలు**

భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ఆసక్తి చూపడానికి ప్రధాన కారణాలలో మొదటిది ఉపాధి. ఎందుకంటే అక్కడ చదువుకోవడం వలన అంతర్జాతీయ అర్హత పొందటం వారికి కెరీర్ పరంగా ఉత్తమమైన ఉపాధి అవకాశాలు వస్తున్నాయి.



భారతదేశ దేశీయ డిగ్రీల కంటే అంతర్జాతీయ అర్హత చాలా విలువైనది.

ఇపుడు విదేశాలు స్టూడెంట్ వీసాల పైన స్టే బ్యాక్ ఆప్షన్ ఇస్తున్నాయి. దీనివలన కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు అక్కడే వుండి ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పిస్తోంది.

భారతదేశంలో అదే ఉద్యోగానికి లభించే వేతనం కంటే విదేశాల్లో లభించే వేతనాలు చాలా అధికంగా ఉంటున్నాయి.

**వలస**

అమెరికా, లండన్ వంటి దేశాలకు విద్యార్థులు వలస వెళ్లే విధంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు వుంది. విద్యార్థులు ఉపాధి పొందిన తర్వాత వాళ్ల శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. కెనడాలో విద్యార్థులకు 3 సంవత్సరాల స్టే బ్యాక్ పాలసీ ఉంది. ఈ సమయంలో వాళ్ల వర్క్ వీసా, శాశ్వత నివాసం కోసం అప్లయ్ చేసుకోవచ్చు. అమెరికాలో 2 సంవత్సరాల స్టే బ్యాక్ పాలసీ ఉంది. ఈ సమయంలో వీసాను వర్క్ వీసాగా మార్చుకునే వెసులుబాటు ఉంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని అభ్యసిస్తున్న విద్యార్థులు తమ ప్రోగ్రాంను పూర్తి చేసిన తర్వాత ఉద్యోగావకాశాలపై దృష్టి పెడతారు. యుకెలో ఉపాధి పొందేందుకు యుకె తన 2 సంవత్సరాల స్టే బ్యాక్ వర్క్ వీసాను తీసుకొచ్చింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఏ దేశంలో చేయాలనేదానికి ఇమ్మిగ్రేషన్ పాలసీ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది భారతీయ విద్యార్థులను ప్రేరేపించే అంశంగా మారింది.

విదేశాల్లో చదువుకోవాలనే విద్యార్థులను ప్రభావితం చేసే అంశాలు ఆర్థికంగా ఎదుగుదల, విభిన్న దేశాల సంస్కృతిక, పర్యావరణం, జర్మనీ వంటి దేశాలలో కూడా ఆంగ్ల మాధ్యమంలో బోధన సదుపాయాలు, పరిశుభ్రమైన పరిసరాలు, సౌకర్యవంతమైన జీవన విధానం. తక్కువ ట్యూషన్ ఫీజులు, మెరుగైన పరిశోధనా అవకాశాలు, కాస్మోపాలిటన్ జీవనశైలి విద్యార్థులను ఆకర్షిస్తున్న ముఖ్యమైన అంశాలు. అనేక ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీలు విద్యార్థులకు కోర్సుల ఎంపిక, అడ్మిషన్, వీసా, బ్యాంక్‌లోన్, స్కాలర్‌సిప్‌లకు సహాయాన్ని అందిస్తున్నాయి.

భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి ఇష్టపడటానికి ముఖ్యమైన కారణాలు:

- సలభంగా అడ్మిషన్ విధానం.
- తదుపరి పరిశోధనలకు అవకాశాలు.
- అత్యున్నత స్థాయి విద్యా వ్యవస్థ.
- గ్లోబల్ మైండ్‌సెట్ అభివృద్ధి.
- మెరుగైన జీవన విధానం.
- ఆర్థికంగా ఎదుగుదల.
- భాషా నైపుణ్యాభివృద్ధి.

నానాటికీ పెరిగిపోతున్న ప్రపంచీకరణలో వివిధ కంపెనీలు, అంతర్జాతీయ అనుభవం ఉన్న ఉద్యోగుల కోసం వెతుకుతున్నారు. విదేశాలలో చదువుకోవడం వలన కలిగే అనుభవం, అర్హత, ప్రపంచంలో ఏ దేశంలో పనిచేయడానికైనా కావాల్సిన అర్హతను, అవకాశాలను

కలిగిస్తున్నాయి. అంతేకాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, లండన్, చైనా, రష్యా, న్యూజిలాండ్, ఫ్రాన్స్ వంటి విదేశాల్లో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అధికంగా ఉన్నాయి.

అందులో అత్యుత్తమ ప్రపంచ స్థాయి అర్హతలున్న అధ్యాపకులతో, బోధనా విధానం ఉంటుంది.

విదేశాల్లో చదువుకునేందుకు .... వంటి ప్రవేశ పరీక్షలు రాయాలి ఉంటుంది.

మెరుగైన విద్య, నాణ్యత, ఉద్యోగావకాశాలు, అధిక జీతం, ఇమ్మిగ్రేషన్, అందుబాట్లోకి వచ్చిన కోర్సులు సులభవంగా కోరుకున్న సబ్జెక్టులలో సీట్లు, మెరుగైన పరిశోధనావకాశాలు, గ్లోబల్ ఎక్స్‌పోజర్, స్కాలర్‌షిప్పులు విభిన్నమైన వాతావరణం.

## ముగింపు

అంతర్జాతీయ విద్య భారతీయ విద్యార్థులకు అపరిమితమైన అవకాశాలకు తలుపులు తెరుస్తోంది. వ్యక్తిగత,వృత్తిపరమైన ఎదుగుదలకు విద్య ఎంతో తోడ్పడుతోంది. ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన అవకాశాలు,... విద్యార్థులను ఉన్నత స్థాయిలో కూర్చోబెడుతోంది.



విభిన్న సంస్కృతులు, దృక్కోణాలను బహిర్గతం చెయ్యడానికి, దేశాల మధ్య అంతరాన్ని తగ్గించి, సౌభ్రాతృత్వం, స్నేహం, మానవత్వాన్ని కలిగిన వ్యక్తులుగా మారుస్తోంది. ❏

# మౌస్‌లెస్ పరికరం

"రెండు చేతులు సరిగ్గా వున్నవాళ్లు కంప్యూటర్ కీబోర్డునీ, మౌస్‌లనీ ఈజీగా వాడవచ్చు. కంప్యూటర్లు రంగాల్లో చక్కటి ఉద్యోగాల్లో కుదురుకోవచ్చు. మరి పుట్టుకతో చేతుల్లేనివాళ్లూ, ప్రమాదవశాత్తు కోల్పోయినవాళ్లూ, చేతులున్నా వాటిని కదపలేనివాళ్లూ ఎలా? తెలివితేటలున్నా వాళ్లు కంప్యూటర్ ఉద్యోగాలకి దూరం కావాల్సిందేనా? ఈ ప్రశ్న ఉదయించింది ప్రవీణ్ కుమార్‌కి.

చెన్నైలో ఓ ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్ రెండో ఏడాది చదువుతుండేవాడు అతను. ఆ తర్వాత రెండేళ్లలో రకరకాల ప్రయోగాలు చేసి చేతుల్లేనివాళ్లూ ఉపయోగించేలా మౌస్‌లెస్ అన్న పరికరాన్ని ఆవిష్కరించాడు. ఈ పరికరంతో పాటు ఓ చిన్న పెన్‌డ్రైవర్ లాంటిది వస్తుంది. దీన్ని కళ్లద్దాలూ, హెడ్‌బ్యాండూ, హెడ్‌ఫోన్సూ, టోపీల్లో పెట్టి సులభంగా వాడుకోవచ్చు. మౌస్‌వేర్‌ను మనం పనిచేయదలచుకున్న కంప్యూటర్‌కో, ల్యాప్‌టాప్‌కో, ట్యాబ్లెట్‌కో అనుసంధానిస్తే చాలు.. మన తల తిప్పేకొద్దీ స్క్రీన్ పైన కూడా కదులుతుంది. మనం చదివే అంశాన్ని క్లిక్ చేయాలనుకుంటే కాలికో, మొండి చేతికో ఓ చిన్న మీటని ఇస్తారు.




దాన్ని నొక్కితే సెలెక్ట్ అయిపోతుంది. ఇక ఏదైనా టైప్ చేయాలనుకున్నప్పుడు ఆ విషయాన్ని నోటితో చెబితే టైప్ చేస్తుంది. గత ఏడాది ఐఐటీ- మద్రాస్ నిర్వహించిన ఇనోవేషన్ పోటీల్లో నెగ్గిన ఈ ఐడియాకి ఆ సంస్థే నిధులు అందించి ప్రోత్సహిస్తోంది. ఆ ప్రోత్సాహం తో 'డెక్స్‌ట్రావేర్ డివైజస్' అనే అంకుర సంస్థని ప్రారంభించాడు ప్రవీణ్‌కుమార్. మౌస్‌లెస్ పరికరాన్ని ఇటీవలే మార్కెట్‌లోకి విడుదల చేశాడు. ❏


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూని స్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూ న్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపిం చాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com








# పూల సొగసు

చేయి తిరిగిన కళాకారులు ప్రకృతి అందాల్ని జాలువారుస్తూ చెట్ల కొమ్మలూ, పూల బొమ్మలూ, పచ్చని ఉద్యానవనాలూ గీయడం తెలిసిందే. కానీ ఆ చిత్రాలను చూస్తుంటే ఇవేవో ఫొటోలు తీసినట్లుగా అనుకుంటారు. కానీ ఇవి ఫొటోలు కావు, చేతితో వేసిన అందమైన పెయింటింగ్ చిత్రాలు. చూస్తుంటే మళ్లీమళ్లీ చూడాలనిపించే చిత్రాలు, ప్రకృతి ప్రేమికుల్ని అమితంగా ఆకట్టుకుంటున్న చిత్రాలను ఫ్రేమ్‌లుగా మార్చి, మార్కెట్లో అమ్ముతున్నారు. వీటిని డ్రాయింగ్‌హాల్లో పెట్టుకుంటే, ఇంటికే కొత్త అందాల్ని తీసుకొస్తుంది.














# ఇకపై మొబైల్ ఫోనే టీవీ



రేడియో, ఫోన్లలోనే రిసీవర్ ఆయా ఫ్రీక్వెన్సీలను గ్రహించి ఎఫ్‌ఎం రేడియో కార్యక్రమాలు ప్రసారం చేస్తాయి కదా. డీ2ఎం పరిజ్ఞానమూ దీన్నే పోలి ఉంటుంది. కాకపోతే ఇది వీడియోలను ప్రసారం చేస్తుంది. ఇంట్లో టీవీ కార్యక్రమాలను రోజూ చూస్తూనే ఉంటాం. మొబైల్ ఫోన్‌లో దఈయూట్యూబ్‌లోనూ అప్పుడప్పుడు వీటిని వీక్షిస్తుంటాం. మరి మొబైల్ ఫోన్లలో రేడియో ఛానెళ్ల మాదిరిగా టీవీ ఛానెళ్లనూ చూస్తే? అదీ ఇంటర్నెట్ అవసరం లేకుండా అలాంటి రోజులు త్వరలోనే రాబోతున్నాయి. మొబైల్ ఫోన్లలో ఎఫ్‌ఎం రేడియో ప్రసారాలను ఆస్వాదిస్తూనే ఉన్నాం. వీటి తరహాలోనే టీవీ కార్యక్రమాలూ ప్రసారమయ్యే రోజులు త్వరలోనే సాకారం కానున్నాయి. ఇందుకు డైరెక్ట్-టు-మొబైల్ (డీ2ఎం) పరిజ్ఞానం వీలు కల్పించనుంది. దీని ప్రయోగ పరీక్షలను 19 పట్టణాల్లో ప్రారంభించనున్నట్టు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది కూడా. దీంతో ఇంటర్నెట్



సదుపాయం లేకుండానే మొబైల్ ఫోన్లలో వీడియో కార్యక్రమాలను చూడొచ్చు. ఐఐటీ కాన్పూర్, సాంఖ్య ల్యాబ్స్ ఈ పరిజ్ఞానాన్ని రూపొందించాయి. మనదేశంలో 80కోట్లమంది మొబైల్ ఫోన్లను వాడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కంటెంట్..ముఖ్యంగా విద్య, అత్యవసర హెచ్చరికల వంటివాటికి ప్రభుత్వం డీ2ఎం పరిజ్ఞానాన్ని వాడుకోవాలని చూస్తోంది.

ఏంటీ పరిజ్ఞానం? డైరెక్ట్ టు మొబైల్ పరిజ్ఞానాన్ని పూర్తిగా దేశీయంగా రూపొందించారు. ఇలాంటి పరిజ్ఞానం ప్రపంచంలోనే మొదటిది. ఒకరకంగా దీన్ని ఎఫ్‌ఎం రేడియోలాంటిదని చెప్పుకోవచ్చు. పరికరంలోని రిసీవర్ వేర్వేరు రేడియో ఫ్రీక్వెన్సీలను గ్రహించి, ఆయా రేడియో కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది కదా. టీవీల్లోనూ ప్రస్తుతం డైరెక్ట్ టు హోం (డీటిహెచ్) విధానంతో కార్యక్రమాలను చూస్తున్నాం. డిష్ యాంటెన్నాలు నేరుగా ఉపగ్రహాల నుంచి బ్రాడ్‌కాస్ట్ సంకేతాలను గ్రహించి సెట్‌టాప్ బాక్స్‌కు చేరవేస్తాయి. సెట్‌బాక్స్ నుంచి టీవీ వాటిని గ్రహించి కార్యక్రమాలను చూపిస్తుంది. డీ2ఎం కూడా దాదాపు ఇలాగే పనిచేస్తుంది. కాకపోతే ఇందులో టీవీకి బదులు ఫోన్లు, ట్యాబ్లెట్ల వంటి పరికరాలు సంకేతాలనుగ్రహించి నేరుగా కార్యక్రమాలను చూపిస్తాయి. ఈ పరిజ్ఞానంలో బ్రాడ్‌బ్యాండ్, బ్రాడ్‌కాస్ట్‌లు రెండూ కలిసి ఉంటాయి. ప్రాంతీయ టెలికమ్యూనికేషన్స్ వసతులు, కేటాయించిన స్పెక్ట్రమ్ సాయంతో నేరుగా ఏటా సంకేతాలు మొబైల్ ఫోన్లకు అందుతాయి. ఇందుకోసం ప్రభుత్వం 470-582 ఎంహెచ్‌జెడ్ స్పెక్ట్రమ్‌ను కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ప్రత్యక్ష క్రీడా ప్రసారాల వంటి మల్టీమీడియా కంటెంట్ నేరుగా ప్రసారం కావటానికిది తోడ్పడుతుంది. ఇంటర్నెట్ అవసరముండని కంటెంట్ ప్రసారంలో ముఖనయంగా వీడియో ప్రసారాల్లో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదని భావిస్తున్నారు.

ఎలా ఉపయోగపడుతుంది?

స్మార్ట్‌ఫోన్ వాడేవారికి, టెలికం ఆపరేటర్లకు ఇద్దరికీ డీ2ఎం పరిజ్ఞానం మేలు చేసే అవకాశముంది. దీంతో 25-30శాతం వరకు వీడియో కంటెంట్ రద్దీ తగ్గుతుంది. ఫలితంగా 5జీ నెట్‌వర్క్ మీదా భారం తగ్గుతుంది. ఇది డిజిటల్ పరిణామ ప్రక్రియ వేగం పుంజుకోవటానికి తోడ్పడుతుంది. మనదేశంలో స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నవారిలో 69శాతం కంటెంట్‌ను వీడియోలే ఆక్రమిస్తున్నాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. డీ2ఎం పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే వీడియోలను ముఖ్యంగా టీవీ కార్యక్రమాలను చూసేవారి మరింత పెరగగలదని ఆశిస్తున్నారు. ❑





# చిన్నింటి ప్రత్యేకత

**ప్రపంచంలోనే** అత్యంత ఎత్తైన భవనం అనగానే దుబాయ్ లోని బుర్జ్ ఖలీఫా గుర్తొస్తుంది ఎవరికైనా. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌తో సహా ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. వాస్తవానికి నిర్మాణశైలికి, ఇంజినీరింగ్ సామర్థ్యానికి ప్రతిబింబంగా నిలిచే భవనాలకు నిలయం దుబాయ్. నగరంలోని సుదూర ప్రాంతాల నుంచి కూడా 160-అంతస్తుల టవర్‌ను ఈజీగా గుర్తు పట్టేయొచ్చు. మనదేశంలో కూడా బుర్జ్‌ఖలీఫా అంటూ ఒక వార్త ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. అదే బిహార్ బుర్జ్ ఖలీఫా. మరి ఈ ఆసక్తికర వివరాలు తెలుసుకోవాలంటే ఈ వార్త చదవాల్సిందే. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ప్రకారం బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లోని గన్నిపూర్ ప్రాంతంలో ఉంది ఈ భవనం. కేవలం ఆరడుగుల స్థలంలో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించడం విశేషం. అంతేకాదు ఇంటి వెడల్పు కూడా ఐదు అడుగులు మాత్రమే. క్యాండీమేన్ వ్లాగర్ ప్రకారం స్థానికులు ముచ్చటగా దీన్ని ఈఫిల్ టవర్ అని పిలుస్తుంటారట. అంతేకాదు 2015లో సంతోష్ అనే వ్యక్తి తన భార్యకు బహుమతిగా దీన్ని నిర్మించాడట. అందుకే దీన్ని ఐకానిక్ తాజ్‌మహాల్‌తో పోల్చాడు. పెళ్లి తరువాత భార్యతో కలిసి ఈ స్థలాన్ని కొనుగోలు చేశాడు. కానీ ఇంత తక్కువ ప్లేస్‌లో ఎక్కువ సౌకర్యాలతో భవనం నిర్మించాలనే ఆలోచనతో సంతోష్ ఓ ఇంజినీర్‌ను కలిసాడు. ఫలితంగా అద్భుతమైన భవనాన్ని డిజైన్ చేసి ఇచ్చాడు ఇంజినీర్. సమీప గ్రామాల ప్రజలు ఈ భవనాన్ని చూసేందుకు తరచూ వస్తుంటారట.

దీంతో ఇది టూరిస్ట్ అట్రాక్షన్‌గా మారిపోయిం దంటూ ఈ భవనం విశేషాలు పంచుకున్నాడు ఈ వీడియోలో. ఇక దీని నిర్మాణాన్ని పరిశీలిస్తే ఇల్లు చాలా తక్కువ స్థలం ఉన్నప్పటికీ, వంటగది, బాత్రూమ్, పడకగదితో సహ అన్ని సౌకర్యాలను కలిగి ఉండే విధంగా దీన్ని నిర్మించారు. ఇది రెండు భాగాలుగా ఇంటి మొదటిభాగంలో మెట్లు, రెండో భాగంలో గదులు ఉంటాయి. ప్రస్తుతం ఈ భవనాన్ని అద్దెకు ఇచ్చారు. కానీ దీని స్పెషల్ లుక్ చూసి అబ్బురపడుతూ ఉంటారట సందర్శకులు.

## ఎక్స్‌ట్రా లార్జ్ టోస్టర్ అండ్ ఓవెన్

**శ్రమను** తగ్గించడమే టెక్నాలజీ ముఖ్య ధ్యేయం. అందులో భాగమే ఈ ఎక్స్‌ట్రా లార్జ్ టోస్టర్ అండ్ ఓవెన్. ఇందులో ఒకేసారి రెండు వెరైటీలను వేగంగా వండుకోవచ్చు. డివైస్ లోపల భాగంలో హోల్ చికెన్ వంటి పెద్దపెద్ద ఐటమ్స్‌తో పాటు..పిజ్జా, కబాబ్స్, కేక్స్ వంటివీ తయారుచేసుకోవచ్చు. ఇక పైభాగంలో కూడా ఆహారాన్ని కుక్ చేసుకోవచ్చు. దీనిపై ఆమ్లెట్స్, పాన్‌కేక్స్ వంటివన్నీ డివైస్‌తో పాటు లభిస్తాయి. పైన ప్రత్యేకమైన మూత కూడా ఉండటంతో కుకింగ్ సులభంగా పూర్తి అవుతుంది. టెంపరేచర్, ట్రైమింగ్ సెట్ చేసుకునే రెగ్యులేటర్‌తో పాటు..టోస్ట్, బేక్, కీప్ వార్మ్ వంటి ఆప్షన్స్‌తో మధ్యలో ఉన్న రెగ్యులేటర్ పని చేస్తుంది.



## ఎయిర్ ఫ్రైయర్

**సాధారణ** హెయిర్ ఫ్రెయర్స్ కంటే..చిత్రంలోని ఈ డివైస్..లార్డ్ అండ్ స్పీడ్ ఆప్షన్స్‌తో క్రిస్పీ రుచుల ప్రియులను ఆకట్టుకుంటుంది. 32 చికెన్ వింగ్స్ కెపాసిటీ డోమ్ ఎయిర్ ఫ్రైయర్‌గా ఇది డిమాండ్‌లో ఉంది. ఇతర ఎయిర్ ఫ్రైయర్‌ల కంటే సుమారు 40శాతం వేగంగా వండి పెడుతుంది. నిమిషాల వ్యవధిలోనే నచ్చిన రుచులను అందిస్తుంది. ఈ సెల్ఫ్ క్లీనింగ్ స్మార్ట్ డిజిటల్ ఎయిర్ ఫ్రైయర్..ప్రత్యేకమైన బాస్కెట్‌తో రూపొందింది. సౌండ్ లేకుండా సైలెంట్‌గా పనిచేస్తుంది. నెలకొకసారి సెల్ఫ్ క్లీనింగ్ ఫంక్షన్ యాక్టివేట్ చేస్తే... చిన్న మరక కూడా లేకుండా క్లీన్ చేసుకుంటుంది. 10 ప్రీ-సెట్‌మోడ్‌లతో ఇది 50కి పైగా రుచికరమైన ఆహారాన్ని అందిస్తుంది. నాన్-స్టిక్ సిరామిక్ కోటింగ్‌తో రూపొందిన బాస్కెట్‌ని క్లీన్ చేసుకోవడం చాలా సులభం.





# ప్రణయ నాదం!

**ప్రేమంటే...**
అనుబంధం పూసిన పుష్పయాగం
అనురాగం ఎగిసిన సుగంధ పరిమళం
సర్వమానవాళి శ్రేయస్సు కోరే
శోభాయమానం!
ప్రేమ...
ఒక పులకింత... ఓ కలవరింత
కులం, మతం అనే సరిహద్దులు లేని గమ్యం
ఓటమి ఎరుగని మలయ మారుతం
ప్రతి జీవిలోనూ చిగురించే
ఓ దివ్యమైన అనుభూతి!
ప్రేమ...
ఆ పేరు వింటేనే
మధురం
గుండెల్లో నాదమై...
కళ్లల్లో వెలుగుదీపమై...
అణువణువునా ప్రాణమై..
నిరంతరం ప్రకాశించే ప్రణయనాదం!

**- కాయల నాగేంద్ర**

# కలలు

**కలల్ని** కంటూ కరిగిపోతాను
కాలం ఒడిని ఒడిసిపట్టుకొని
గోదావరి అలలలో కెరటమై
ఎగిసి పడుతుంటాను..
గుండె లోగిల్లో పొంగిన
ప్రేమ సంద్రాన్ని పట్టుకొని
పరుగు పెడతాను...
ప్రణవ గీతమైన చెలి
కళ్లలో కొత్త కాంతులకై
కలలు కంటాను...
తెల్లారి వేకువ లోపు
నన్నొడిచి అవి జారిపోతూ...
ఒంటరిని చేసి..
వేదనతో ఆట పట్టిస్తూ...
తమ దారిని వెతుక్కుంటూ
శూన్యంలోకి..
కొత్త ఆశల కోసం
మరో స్వప్నం రూపాంతరంకై
ఆమె హృదయంలో
తుమ్మెదలా వాలిపోతాయి!

**- రవీందర్ కొండా**



# ఎడారి హృదయంలో ఒయాసిస్సు

దశాబ్దాల విరహాగ్ని జ్వాలలు
నన్ను నిలువెల్లా దహించివేస్తుండగా
నువ్వు నాకోసం తిరిగి వస్తావనే ఆశ
ఆకాశంలా విస్తరించి
జీవితంపై మమకారాన్ని
నాలో చిగురింపజేసింది!
నీ ఉనికి కోసం..
ఈ సువిశాల విశ్వాన్ని
నా నయనాల అన్వేషణతో
అణువణువూ శోధించాను!
ఎడారుల్లో.. నందనాలలో
అరణ్యాలలో..
ఎక్కడెక్కడో వెతికాను
నీ పాదాల జాడలైనా కనిపిస్తాయని!
ఓ పవిత్ర బ్రహ్మీ ముహూర్తంలో
అద్భుతమే జరిగింది ప్రేయసీ!
నా అంతరాత్మ
నాకు జ్ఞానబోధ చేసింది!
నువ్వు నా తనువులోని
ప్రతి నరంలోనూ
కొలువై వున్నావని
దైవంలాగే
సర్వాంతర్యామి తత్వం
ప్రేమకు కూడా వుందని
నా ఎడారి హృదయంలో
ఒయాసిస్సులా నువ్వు దాగి వున్నావని
ఆత్మప్రబోధం వినిపించింది!
ఆ మహోన్నత క్షణాలలోనే
నా భగ్న
హృదయానికి
ఊరట కలిగింది ప్రియసఖీ!

**- విడదల సాంబశివరావు**



## 'నేను మంచిదాన్నేనా'



రచయిత్రి ఈ కథాసంపుటిని ఆమె భర్త కొండారెడ్డికి అంకితం చేసారు. డాక్టర్ జోలపాలెం భాగ్యలక్ష్మి, టిఎస్ఎ కృష్ణమూర్తి (రచయిత), రాధికాప్రసాద్ లాంటి సాహితీ పెద్దలు చక్కటి విలువైన ముందుమాటలు రాసారు. మొత్తం 12 కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఈ కథను శీర్షికగా పెట్టిన కథలో ఒక మధ్యతరగతి యువతి కథ. గుమాస్తాగా రిటైర్డ్ అయిన ఓ తండ్రి తన కూతురుకు రెండో సంబంధంగా భార్య చనిపోయిన వ్యక్తికి ఇచ్చి పెళ్లిచేస్తాడు. ఆ పెళ్లి కొడుక్కి ఒక (భువన) అనే కూతురు ఉంటుంది. ఆ అమ్మాయి పెళ్లీడుకు రావడం, తన సవతి తల్లిని చూసుకోవాలి అనే షరతు తనకు కాబోయే భర్తకు పెట్టిన భువనను అభినందిస్తూ 'నేను మంచిదాన్నేనా' అని ఆలోచనల్లోపడుతుంది. తన తండ్రికి సవతి తల్లికి పుట్టిన మగబిడ్డను సొంత తమ్ముడిగా చూడటం అతను ఆడపిల్లల్ని వేధిస్తే చెంపపగల గొట్టిన భువన పాత్ర అద్భుతంగా మలిచారు. 'అల్లుడుగారు' కథలో అత్త ధరణికి మళ్లీ పెళ్లి తన ప్రొఫెసర్‌తో చేయడానికి హోటల్ పార్టీలో నిర్ణయం చేయడం, భర్తలోని ఆదర్శభావాలు తెలుసుకొన్న అనన్య సముద్రతీరంలో వినయ్ ఒళ్లో ఒదిగిపోవడంతో కథ ముగుస్తుంది. అచ్చంగా తెలుగు ప్రచురణలు సంస్థ ఓ మంచి కథా సంపుటి అందించడం అభినందనీయం. మరింత మెరుగైన శైలితో బలీయమైన కథా వస్తువులతో మరిన్ని కథలు ఉమాదేవి రాయాలని ఆశిద్దాం.

**(నేను మంచిదాన్నేనా.., రచన: రామిగాని ఉమాదేవి, వెల: రూ 150, ప్రతులకు: ఇ.నం.4/1-5-ఇ- 4, కృష్ణ నగర్, 5వ క్రాస్, మదనపల్లి) – తంగిరాల చక్రవర్తి**

## మనసుకు నచ్చే కథలు



రచయిత ఒరుగంటి ప్రసాద్ గ్లోబుకు అటేపు (అమెరికా) ఇటేపు (కోనసీమ) తెలుసు. బాల్యం బంగారం లాంటిది. పాతబడిన కొద్దీ విలువ పెరుగుతుంది. కనమరుగు అయిన కొద్ది మనసులో కదలాడుతుంది. మళ్లీమళ్లీ జ్ఞాపకం వస్తుంది. వచ్చిన ప్రతిసారీ పెదాలపై చిరునవ్వు కదలాడటం కనిపించకపోయినా మనసు రాగరంజితం అవుతుంది. గోరటి వెంకన్నలాంటి కవి పాటలై ప్రవహిస్తాడు. సత్యం శంకరమంచిలాంటి వ్యాసకర్త ఆలోచనలను 'అమరం' చేస్తారు. ప్రసాద్ లాంటి కవి, కథకుడు, గాయకుడు, కథలై, పాటలై గోదావరిలా గలగలా ప్రవచిస్తాడు. 'వంగరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి 113వ ప్రచురణ మా ఊరికథలు. వీటిని 'కథలు' అనటం కంటే 'వ్యాసకథలు' అనటం సబబు. కొన్నికొన్ని 'కథల్లో' (అనాతరం క్రికెట్ కథలు) కథకంటే వివరణలే ఎక్కువ ఉన్నాయి. వందరోజులు వందకోట్ల కథల్లో పాత జ్ఞాపకాలే డామినేట్ చేస్తాయి. మాఊరి సీతారామకళ్యాణం'లో నాటి, నేటి దేవుని పెళ్లి పోలికలున్నాయి. అభివృద్ధి, సాంప్రదాయాలను ఏకరువు పెట్టడంలో మంచి నిపుణత, పఠనీయత కనబర్చారు రచయిత. ముందుమాటలో విశాలిపేరిగారు చెప్పినట్లు నాటి మాల్గుడి డేస్‌ను. నేటి సెల్‌ఫోన్ యుగంతో సంధానించినట్లుంటాయీ కథా వ్యాసాలు.

**(మాఊరి కథలు, రచన: ప్రసాద్ ఒరుగంటి, వెల: రూ 200, ప్రతులకు: ఇండియాలో జ్యోతివలబోజు, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా)**

**– కూర చిదంబరం**

# పుస్తక సమీక్ష

## అనుభవాలే కవితలుగా



యువకవి చింతారాంబాబు తన తొలి కవితా పొత్తాని 'విరమించని వాక్యం' అంటున్నాడు. 'ఎవరితో మనసు విప్పి మాట్లాడాలనే/ ఆమె స్థితి ఎప్పటికే/ విరమించని వ్యాకం' అంటు నేటి సమాజంలో భద్రత కరవైన స్త్రీల పరిస్థితిని దృశ్యమానం చేశాడు రాంబాబు. 'నాన్నే నా హీరో' అంటున్న ఈ కవి అమ్మ, నాన్నల జ్ఞాపకాలతో రాసిన కవితలు కడుహృద్యంగా వున్నాయి. 'అక్షరం' ఏం చేస్తుంది? అక్షరం జ్ఞానిలా మారుస్తుంది అంటూ 'చదువు' విలువను తెలియజేస్తున్నాడు. 'తరగతి గది..నా జీవితానికి ఊపిరి/ నా గమనానికి దిక్సూచి' అంటూ బాల్యస్మృతులను తడుముకుంటాడు. 'మట్టిపలక' అంటే ఈ తరం బాల్యానికి అవగాహన తక్కువే. కంప్యూటర్, ఐఫోన్, టాబ్లెట్ యిలా అత్యాధునిక పరికరాలే వారి దృష్టిలో జ్ఞాన దీపికలు.. 'అక్షరాల ఉగ్గుపట్టి..పదాలతో నడిపించి/ వాక్యాలుగా పరుగులు పెట్టించిన/ నా చిన్ననాటి నేస్తం మట్టి పలక' అంటూ ఈ చిన్ననాటి నేస్తాన్ని గుర్తు చేసుకుంటున్నాడు. 'కవిత్వమంటే' తనకు తెలిసిందీ, ఊహించిందీ రాశాడు కవి. కానీ వ్యక్తీకరణలో మెళకువలు ఆకళింపు చేసుకోవాలంటే అధ్యయనం, అభ్యాసం తప్పనిసరి అని చింతా రాంబాబుకి తెలియదని కాదు. ముమ్ముందు మంచికవిగా రూపు దిద్దుకుంటాడని ఆశిద్దాం.

**(విరమించని వాక్యం, రచన: చింతా రాంబాబు, వెల: రూ 150, ప్రతులకు: తపస్వి మనోహరమ్ పబ్లికేషన్స్, కొండాపూర్, హైదరాబాద్) – రమణ వెలమకన్ని**

## ఆనంద్ బొమ్మల పాఠాలు



శిరంశెట్టి ఆనంద్, చిత్రకళాకారునిగా, కార్టూనిస్ట్‌గా, కవి, రచయిత, శిల్పిగా బాలబాలికలకు 'చిన్నబడి' చిన్నారుల బొమ్మలు, 'పెద్దబడి' బాలలగీతలు రెండు పుస్తకాలు ప్రచురింపచేయడం అభినందనీయం. డ్రాయింగ్, చిన్నారులకు నేర్పించడం వారిలో సృజనాత్మక పెంపుదలతో, భవిష్యత్‌లో ఉన్నతులుగా తీర్చిదిద్దుకొనే అవకాశం అందిస్తుంది. ర్యాంకుల కోసం లేత మనస్సులకు మానసిక ఒత్తిడి, ఆందోళన కలిగించే సమాజంలో చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నాట్యం, కవిత్వం, క్రీడలు యితర కళలపట్ల ఆసక్తి కలిగించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కర్తవ్యంగా నిర్వర్తించాలి. 'సవ్యసాచి ఆనంద్' కళాకారునిగా బొమ్మల పుస్తకంలో తెలుగు, హిందీ, ఇంగ్లీష్ అక్షరాలతో బొమ్మలు గీయడం, పెన్సిల్ షేడింగ్, ఫ్రీలైన్ డ్రాయింగ్, కార్టూన్‌ల కలరింగ్ చిన్నారులకు ఆసక్తి కలిగించే పాఠ్యాంశాలుగా రూపొందించారు. 20రకాల డ్రాయింగ్స్, బొమ్మలకు కలర్స్ వేయడం చిన్నారులకు శ్రద్ధాసక్తులు కేంద్రీకరించే అభ్యాసం వలన ఏకాగ్రత పెంపొందింప చేసే మంచి లక్షణం చదువులో రాణించే అవకాశాలు మంచి హాబీకి ఈ పుస్తకాలు మార్గం చూపిస్తున్నాయి. జిల్లా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఆర్ట్ టీచర్‌గా అవార్డు పొందారు ఆనంద్. **(చిన్నారుల బొమ్మలు, బాలల గీతలు, వెల: రూ 100, ప్రతులకు: సాయిశ్రీ పబ్లికేషన్స్, ఇం.నం.1-10-114, 17వ వార్డ్, అంబేద్కర్‌నగర్, సూర్యాపేట) – యర్రమిల్లి**



# చీకట్లోనూ స్పష్టంగా చూపిస్తుంది

**రాత్రివేళ** చీకట్లో దగ్గరగా ఉన్న వస్తువులను కూడా స్పష్టంగా చూడటం సాధ్యం కాదు. చీకట్లో భూతద్దాలను ఉపయోగించినా ఫలితం ఉండదు. ఈ బైనాక్యులర్ చేతిలో ఉంటే మాత్రం చీకట్లోనూ దూరంగా ఉన్న వస్తువులను స్పష్టంగా చూడటం సాధ్యమవుతుంది. జపాన్‌కు చెందిన కెమెరాల యారీ కంపెనీ 'యాషికా' ఇటీవల ఈ నైట్‌విజన్ బైనాక్యులర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇది 5000 ఎంఏహెచ్ సామర్థ్యం గల రీచార్జబుల్ లిథియం అయాన్ బ్యాటరీతో పనిచేస్తుంది. ఇందులోని ఫిక్స్‌డ్ ఆప్టికల్ జూమ్‌ను ఉపయోగిస్తే, దూరంగా ఉన్న వస్తువులు మూడురెట్లు దగ్గరగా కనిపిస్తాయి. డిజిటల్ కెమెరాల మాదిరిగానే దీనికి నాలుగు అంగుళాల హై డెఫినిషన్ డిస్‌ప్లే ఉంటుంది. దీనిద్వారా చీకట్లో 600 మీటర్ల దూరంలో ఉన్న వస్తువుల రంగులను సైతం స్పష్టంగా చూడ వచ్చు. ఇందులోని 512 జీబీ ఎక్స్‌టర్నల్ మెమరీకార్డులో చూసిన దృశ్యాలను రికార్డు చేసుకోవచ్చు.



# మొక్కల గీతాలు

**మొక్కలకు,** చెట్లకు అనుభూతులు ఉంటాయి. వాటిలో అవి సంభాషణలు జరుపుకుంటాయి అని శాస్త్రవేత్తలు ఇదివరకే కనుగొన్నారు. మొక్కలు సంగీతాన్ని కూడా ఆలపిస్తాయి. అయితే వాటి సంగీతం మన చెవులకు సోకదు. మొక్కల సంగీతాన్ని వినగలగేందుకు వీలుగా ఈ పరికరాన్ని రూపొందించాడు. దీనికి 'టెగెల్' అని పేరు పెట్టాడు. చూడటానికి ఇది ఇటుకలతో తయారు చేసినట్లు కనిపిస్తున్నా, పూర్తిగా కలపతోనే తయారైంది. ఇందులోని మట్టికుండలో మొక్కను నాటి, దాని నుంచి వెలువడే ధ్వని తరంగాలను స్వీకరించేలా విద్యుత్తు తీగలను అమర్చారు. దీనిలోని స్పీకర్ అమరిక ద్వారా మొక్కల నుంచి వెలువడే సంగీతం మనకు కూడా వినిపిస్తుంది. అలాగే దీనికి అమర్చిన కీబోర్డును వాయిస్తూ మనుషులు కూడా సంగీతాన్ని సృష్టించవచ్చు. ప్రయోగాత్మకంగా రూపొందించిన ఈ పరికరాన్ని మార్కెట్లోకి ఇంకా రాలేదు.

# అనువాదం చేసే గ్లాసు

చూడటానికి ఇది హైటెక్ గ్లాసులా కనిపిస్తుంది గాని, నిజానికి ఇది హైటెక్ దుబాషీ. భాష తెలియని ప్రాంతాల్లో ప్రయాణాలు చేసేవాళ్లకు ఇది బేషుగ్గా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు జపాన్‌లో ప్రయాణించే వ్యక్తికి ఇంగ్లిష్ తప్ప జపాన్ రాదనుకోండి. ఈ గ్లాసులా కనిపించే పరికరాన్ని మైకులా పట్టుకుని చెప్పదలచుకున్న మాటలను ఇంగ్లిష్‌లో చెబితే, వెంటనే జపాన్‌లోకి అనువదించి చెబుతుంది. అలాగే ఎదుటి వ్యక్తి మనకు తెలియని భాషలో బదులిస్తే, ఇది వెనువెంటనే మనకు అర్థమయ్యే భాషలో అనువదించి చెబుతుంది. ఇది మొబైల్ ఫోన్ యాప్‌కు అనుసంధానమై, రీచార్జబుల్ బ్యాటరీ సహాయంతో పనిచేస్తుంది. 'ట్యూవీ డిజైన్' బహుళజాతి సంస్థ దీనిని 'ఫెలో ట్రావెల్' పేరుతో మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇది దుబాషీగా మాత్రమే కాకుండా ట్రావెల్ గైడ్‌గా కూడా పనిచేస్తుంది.




**చాలామంది** ఇండ్లలో పిల్లలు పొద్దస్తమానం సెల్‌ఫోన్లతోనే గడుపుతున్నారు. ప్రత్యేకించి ఆన్‌లైన్ గేమ్స్‌లకు వారు వ్యసనంగా మారుతున్నారు. డిజిటల్ టెక్నాలజీ ప్రపంచంలో పదేండ్ల పిల్లలు, యువత ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలుగా మారారన్నది కఠోర వాస్తవం. చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ ఆటవస్తువుగా ఫిక్స‌వుతున్నారు.



# ఆన్‌లైన్ గేమ్స్‌తో ముప్పు

ఆన్‌లైన్ గేమ్స్ కాలక్షేపం నుంచి వ్యసనంగా మారిపోయాయి. ఫలితంగా పిల్లలు చదువులో వెనకబడటమే కాక, వారి ఆలోచనలు కూడా పక్కదారి పడుతున్నాయి. మోమో చాలెంజ్, పబ్జీ, బ్లూవేల్ చాలెంజ్‌లాంటి ఆన్‌లైన్ గేమ్‌లు ఎందరి జీవితాలనో బలి తీసుకుంటున్నాయి. పిల్లలకు ఫోన్ దూరం చేసినప్పుడు వారి ప్రవర్తనలో తీవ్రమైన విచారం, ఆందోళన చోటు చేసుకుంటున్నాయని అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ పరిశోధనలో తేలింది. ఫోన్ లాక్కున్నందుకు ఆత్మహత్యకు పాల్పడిన వార్తలూ చదువుతూనే ఉన్నాం. ఆన్‌లైన్ గేమ్స్ సమయాన్ని హరిస్తూనే అందినకాడికి దోచుకుంటున్నాయి యాప్ సంస్థలు. ఆటలో తర్వాతి లెవల్‌కు వెళ్లడానికి, షూటింగ్ గేమ్స్‌లో ఆయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కొనుగోలు చేసేలా ప్రేరేపిస్తున్నాయి. ఫ్రీ-టు-ప్లే అంటూనే లెవల్స్ దాటిన తర్వాత డబ్బులు కడితేనే తర్వాతి లెవల్ అంటున్నాయి. గేమ్‌కు అలవాటుపడిన చాలామంది తల్లిదండ్రులను ఏమార్చి క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డుతో డబ్బులు కట్టి మరీ వాటిని కొనసాగిస్తున్నారు. మల్టీ ప్లేయర్ గేమ్స్ ఫ్రీ అని చెబుతూనే ఇంకో తరహాలో వేధిస్తుంటారు యాప్ నిర్వాహకులు. యాప్‌లలో ప్రకటనలు వేలం వెర్రిగా వస్తుంటాయి. గేమ్ ప్రొడక్ట్ కొనుగోలు చేయాల్సిందిగా ప్రకటనలు క్యూ కడతాయి. ఇన్సెంటివ్ బేస్డ్ అడ్వర్టయిజులు వస్తుంటాయి. ప్రీమియమ్ వెర్షన్ కొనుగోలుకు, గేమ్ అప్‌డేట్‌కు డబ్బులు చెల్లించాల్సిందిగా సందేశాలు పంపుతుంటాయి. ఉచిత సభ్యత్వం అంటూనే ఊరించే ఆఫర్ల వస్తుంటాయి. మొత్తంగా ఆటకు అలవాటు పడిన వాళ్ల నుంచి ఏదోరకంగా డబ్బులు వసూలు చేయడమే వీటి లక్ష్యం. గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ఆన్‌లైన్‌లో కొదువ లేదు. కలర్ ప్రెడిక్షన్ యాప్ అలాంటిదే! ఇందులో రంగుల కలయికను అంచనావేసి పందెం కాస్తుంటారు. మొదట ఆధార్‌కార్డ్, పాన్‌కార్డు, ఇతర వివరాలు నమోదు చేసేలా ప్రోత్సహిస్తారు. ఎక్కువమందిని జాయిన్ చేస్తే రివార్డు అందుతుందని మభ్యపెడతారు. ఆ తర్వాత అసలు ఆట మొదలవుతుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్లేయర్ పేరిట బ్యాంక్‌ఖాతాను తెరిచి, ఖాతాకు ఇ-వాలెట్‌ను లింక్ చేస్తారు. ఇక బెట్టింగ్ మొదలవుతుంది. గెలిచామన్న







ఉత్సాహంతో పెద్దమొత్తంలో పందెం కాసేలా ప్రేరేపిస్తారు. యాప్ వాలెట్‌లో గెలుచుకున్న మొత్తం కనిపిస్తుండటంతో డబ్బు ఎక్కడికీ పోదన్న ధీమాతో పెద్ద మొత్తంలో పందెం కాస్తారు.

అదీ గెలిచినా డబ్బు విత్ డ్రా చేయాలంటే ఇన్‌కమ్‌ట్యాంక్స్, జీఎస్టీ ఫీజుల పేరుతో అడ్వాన్స్ చెల్లించాలని మరిన్ని డబ్బులు వసూలు చేసి మొత్తంగా కుచ్చుటోపి పెడతారు. డబ్బు బదిలీ చేసిన తర్వాత, ఫ్రాడ్‌స్టర్ల కమ్యూనికేషన్ మార్గాలను బ్లాక్ చేస్తారు. దాదాపు అన్ని రకాల ఆన్‌లైన్ ఫ్రాడ్ గేమ్స్ ఇదే పద్ధతిని ఫాలో అవుతున్నాయి.




కథ

# నాణ్యమైన కుండలు

**ఈశ్వరయ్య,** నాగేంద్రం ఇరుగుపొరుగు నివసించేవారు. ఇద్దరూ మట్టికుండలు, పాత్రలు తయారు చేసి అమ్మి జీవనం సాగించేవారు. ఈశ్వరయ్య కుండలు చాలా మన్నికగా ఉండేవి. అందువల్ల జనం వాటిని ఎక్కువగా కొనేవారు.

తనకంటే ఈశ్వరయ్యకు చాలా పేరు రావడం సహించలేని నాగేంద్రం రుసరుసలాడేవాడు.

అయినదానికి కానిదానికి ఈశ్వరయ్యపై ఒంటికాలిపై వెళ్లి తగాదాపడేవాడు. ఒకరోజు ఒక బిచ్చగాడు ఈశ్వరయ్య వద్దకు వచ్చాడు. 'నువ్వు తయారు చేస్తున్న కుండలో నీళ్ల చాలా చల్లగా ఉంటాయట. జనమంతా అనుకుంటున్నారు. కొంచెం నీళ్ల ఇచ్చి నా దాహాన్ని తీరుస్తావా?' అన్నాడు బిచ్చగాడు.

'ఎంతమాట! తప్పకుండా మీ దాహాన్ని తీరుస్తాను. ఇంత ఈ మంచినీళ్ల తాగండి' అని అందించాడు ఈశ్వరయ్య.

ఈ దృశ్యాన్ని అక్కడే ఉన్న నాగేంద్రం చూశాడు. బుసలు కొడుతూ ఈశ్వరయ్య మీదకు వచ్చాడు. 'చివరకు బిచ్చగాడికి కూడా నీ కుండలే నచ్చాయి. నువ్వు కుండలు చేస్తున్నంత కాలం నాకు మంచిపేరు రాదు' అంటూ ఈశ్వరయ్య కుండలన్నీ పగలకొట్టాడు నాగేంద్రం. 'అదేమిటి కుండలన్నీ అలా పగలకొట్టావు. చేతనైతే నువ్వు కూడా నాణ్యమైన కుండలు తయారుచేసి మంచి పేరు సంపాదించుకో' అన్నాడు అక్కడు ఉన్న బిచ్చగాడు.

'చివరకు బిచ్చగాడు కూడా నాకు నీతులు చెప్పేవాడే! నా బతుకు అలా తగలడింది' అంటూ బిచ్చగాడిని కొట్టడానికి కర్రను పైకెత్తాడు నాగేంద్రం.

అంతలో ఒక కత్తి ఆ కర్రకు అడ్డుపడింది.

'మహారాజా! ఆజ్ఞాపించండి. ఈ ద్రోహి శిరస్సును ఒక్కవేటులో తెగనరుకుతాను' అన్నాడు ఆ వ్యక్తి అప్పటికిగాని అందరికీ అర్థం కాలేదు. బిచ్చగాడి రూపంలో వచ్చిన వ్యక్తి ఆ దేశ మహారాజు. అతని ప్రక్కన ఉన్నది మహామంత్రి అని.

ఎదురుగా ఉన్న రాజు. మంత్రిని చూసి నాగేంద్రం గజగజ వణికిపోయాడు.

'క్షమించండి మహారాజా! ఈ ఒక్క తప్పును కాయండి. ఇకపై ఇటువంటి పొరపాటు మరోసారి చేయను' అంటూ మహారాజు కాళ్లపై పడ్డాడు నాగేంద్రం. 'నువ్వు పడవలసింది నా కాళ్లపై కాదయ్యా! ఈశ్వరయ్య కాళ్లపై. లేదా నువ్వు ఈశ్వరయ్య కుండలు పగులకొట్టి నందుకు ఇక్కడే శిక్షిస్తాను' అన్నాడు మహారాజు.

'క్షమించండి మహారాజా! ఈ నాగేంద్రం అనాలోచితంగా, తెలిసో తెలియకో నా కుండలు పగులకొట్టి తప్పుచేశాడు. ఈ ఒక్క తప్పును మన్నించి శిక్షించకుండా వదిలేయండి' అని అర్థించాడు ఈశ్వరయ్య. 'చూడవయ్యా! నువ్వు తన కుండలు పగులకొట్టి అపకారం చేసినప్పటికీ ఈశ్వరయ్య నిన్ను క్షమించి శిక్ష నుంచి కాపాడాలను కుంటున్నాడు. ఇకపై మంచిగా బతుకు' అని అన్నారు మహారాజు. 'ఇంతకూ తమరు వచ్చిన పనేంటి మహారాజా?'ప్రశ్నించాడు ఈశ్వరయ్య.

'పొరుగు రాజ్యం రాజుకు నువ్వు చేసిన కుండలు చాలాబాగా నచ్చాయట. వెయ్యి కుండలు తమ రాజ్య ప్రజల కోసం తయారు చేయించమని కోరారు. నీ గురించి పూర్తిగా తెలుసుకోవాలని మారువేషంలో వచ్చాను. నీ ప్రతిభను కళ్ళారా చూసి తెలుసుకున్నాను' అన్నారు. మహారాజు.

'ధన్యవాదాలు మహారాజా! సాధ్యమైనంత త్వరలో వెయ్యి కుండలను తయారు చేసి మీకు అందిస్తాను' అని చెప్పాడు ఈశ్వరయ్య.

మహారాజు అక్కడి నుండి వెళ్లిపోయారు. నాగేంద్రం ఈశ్వరయ్య కాళ్లపై పడి క్షమాపణ కోరుకున్నాడు.

'నాగేంద్రం! ఈ వెయ్యి కుండలు తయారు చేస్తున్నప్పుడు నువ్వు నాతో కలిసి పనిచెయ్యి. నేను నాణ్యమైన కుండలను ఎలా తయారు చేస్తున్నానో తెలుసుకో' అన్నాడు ఈశ్వరయ్య.

ఆరోజు నుండి ఈశ్వరయ్య వద్ద నాణ్యమైన కుండలు, పాత్రల తయారీ విధానాన్ని నేర్చుకుని మంచి పేరు తెచ్చుకున్నాడు నాగేంద్రం.

– షేక్ అబ్దుల్ హకీం జాని





## బాలగేయం

### పరీక్షలు



చదువు..చదువు
పరీక్షల వేళ
చదువే మా ప్రపంచం
పుస్తకాలే మా నేస్తం
పరీక్షలే మా ఆయుధం
మంచి భవితకు
పరీక్షలే మార్గం
ఇష్టంతో చదువుతాం
కష్టంతో కాదు సుమా!
ఆటపాటలన్నీ బంద్
వేసవి సెలవుల్లో
కేరింతలే మా ప్రపంచం
చదువే మాకు ముద్దు
మంచి ర్యాంకులే
మా లక్ష్యం
అందుకు కావాలి
అందరి సహకారం
తోటివారికి
సాయం చేస్తాం
ఆదర్శ విద్యార్థులుగా
మిగిలిపోతాం.

**- రూతు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.అద్వైత,** వరంగల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. ఇండియా గేట్ ఎవరు, ఎప్పుడు, ఎందుకు కట్టారు?

**జవాబు: అద్వైత!** ఇండియా గేట్ కేవలం ఒక కట్టడం మాత్రమే కాదు. మన సైనికుల త్యాగానికి గుర్తు. అందుకే దానిని 'ఆల్ ఇండియా వార్ మెమోరియల్' గా పిలుస్తారు. అంటే అఖిల భారత యుద్ధ స్మారక చిహ్నం అని. ఇది న్యూఢిల్లీలోని రాజ్‌పథ్‌లో ఉన్నది. – ఒకటో ప్రపంచ యుద్ధం, ఆఫ్ఘన్ యుద్ధాల్లో ప్రాణాలు అర్పించిన 90,000 మంది భారతీయ సైనికుల త్యాగానికి గుర్తుగా బ్రిటిష్ ప్రభుత్వం కట్టిన స్మారక చిహ్నం 'ఇండియా గేట్'.

– దీనికి 1921లో ఫిబ్రవరి 10న శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తి కావడానికి పదేళ్లు పట్టింది.

– ఇండియా గేట్ ఎత్తు 42 మీటర్లు. దీని పైన మధ్యలో గిన్నెలా ఉంటుంది. వార్షికోత్సవాల సందర్భంగా నూనె పోసి వెలిగించడానికి దీనిని కట్టారు.

– ఇండియా గేట్ పై భాగంలో ఇంగ్లిష్ అక్షరాలతో ఇలా చెక్కి ఉంటుంది.

To the dead of the Indian Armies who fell honoured in France and flanders Mesopotamia and Persia East Africa Gallipoli and Elsewhere in the near and the far-East and in sacred memory also of those whose names are recorded and who fell in India or the North East frontier and during the Third Afghan War.

ద్వారం ఆకారంలో ఉండే ఇండియా గేట్ కింద అమర్ జవాన్ జ్యోతి ఉంది. దీనిని 1971లో ఏర్పాటు చేశారు. ఒక సైనికుడి సమాధి మీద తలకి పెట్టుకునే హెల్మెట్ తొడిగిన తుపాకి ఉంటుంది. దీనికి నాలుగు వైపులా ఎప్పుడూ దీపాలు వెలుగుతూనే ఉంటాయి.



# ప్రేమను ప్రేమించు..

**శ్రీరాముడు** ఒకరోజు ఉద్యానవనంలో సీతను చూసాడు. తండ్రి దశరథుడి ఆదేశంతో విశ్వామిత్రుడి యాగసంరక్షకుడిగా వెళ్లిన సమయంలో ఆ సంఘటన జరిగింది. సీత రూపలావణ్యం, వ్యక్తిత్వం చూసి రాముడు ముగ్ధుడయ్యాడు. సీతను వివాహం చేసుకోవాలని అనుకున్నాడు. అదే సమయంలో సీత కూడా శ్రీరాముడిని చూసింది. శక్తి, యుక్తి, శరీర సౌష్టవం, ప్రవర్తన చూసి ముచ్చటపడింది. రాముడే తన భర్తగా రావాలని పార్వతిని ప్రార్థించింది. ఇలా ఒకరిపై ఒకరికి ప్రేమ కలిగింది. అయితే ఏమాత్రం తొందరపడలేదు. సీత శక్తి సామర్థ్యాలు గుర్తించిన ఆమె తండ్రి తన ఇంటిలో ఉన్న శివధనస్సును ఎక్కుపెట్టిన బలశాలికే సీతను ఇచ్చి వివాహం జరిపిస్తానని అప్పటికే ప్రకటించారు. సీత చిన్ననాటి సంఘటనే దీనికి కారణం. ఆమె ఓ రోజు బంతితో ఆడుకుంటుండగా అది శివధనస్సు కిందకు వెళ్లింది. ఆమె ధనస్సును అలవోకగా పైకి లేపి బంతిని తీసుకున్నది. ఆ దృశ్యాన్ని చూసిన జనకుడు ఆరోజే శివధనస్సును ఎక్కుపెట్టిన యువరాజే తన కూతురికి భర్త కావాలని కోరుకున్నాడు. జనకమహారాజు సీతకు తగిన వరుని కోసం స్వయంవరం ఏర్పాటు చేశారు. శివధనస్సు విరిచిన వారికే సీతను ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు. లంకాధీశుడు రావణుడు సహా పలువురు స్వయం వరానికి వచ్చారు. రాముడు మాత్రమే శివధనస్సును ఎక్కుపెట్టి, సంధించి విరిచాడు. దీంతో సీత ఆనందానికి అంతులేకుండా పోయింది. తను కోరుకున్న వాడే తనకు తగిన భర్తని, ఆయనే తనను జీవితకాలం రక్షించగలడని భావించింది.

స్వయంవరంలో రాముడిని సీత వరించడంతో జనకుడు తన కుమార్తె సీతను వివాహం చేసుకోవాలని రాముడిని కోరాడు. అయితే దీనికి తన తండ్రి దశరథుడి అనుమతి అవసరం అని రాముడు చెప్పాడు. తాను తండ్రి ఆదేశంతో యాగసంరక్షకుడిగా వచ్చానని వివరించాడు యజ్ఞానికి వచ్చిన తనను ఆహ్వానించడంతో స్వయంవరానికి వచ్చానని తెలిపాడు. తండ్రి అనుమతి తీసుకున్న తర్వాతే సీతను వివాహం చేసుకుంటానని చెప్పాడు.

పెళ్లికి తండ్రి అనుమతి కావాలని రాముడు చెప్పడంతో ఆయనపై సీతకు మరింత గౌరవం, ప్రేమ పెరిగింది. అత్తవారింట్లో లభించాల్సిన గౌరవం, మర్యాద, భద్రత కోసం రాముడు అలాంటి నిర్ణయం తీసుకున్నాడని భావించింది. తర్వాత వారి జీవితం సమాజానికి ఆదర్శంగా నిలిచింది. రావణుడు సీతను అపహరిస్తాడు. ఆఖరికి రాముడి చేతిలో మరణిస్తాడు. సీతారాముల ప్రేమ ఆదర్శంగా నిలిచింది. శూర్పణఖ, రావణుడు వ్యామోహం పతనానికి దారితీసింది.

**ప్రేమంటే..:** ప్రేమను నిర్వచించడం అంత సులభం కాదు. తెల్లనివన్నీ పాలుకాదు. మెరిసేదంతా బంగారం కాదు. అలాగే ఇద్దరి మధ్య మొగ్గతొడిగే ప్రతి మురిపాన్ని ప్రేమ అనలేం.

డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి, సైకాలజిస్ట్

ఆధునిక యువతలో కొందరు తమలో రగిలే కోర్కెలు, తపన, వ్యామోహం, కామవాంఛలను ప్రేమగా భ్రమిస్తున్నారు. తమ శారీరక ప్రకోపాలను తీర్చుకోవడానికి ప్రేమ ముసుగు వేసుకుంటున్నారు.

తాత్కాలిక సుఖాల కోసం కన్నవారిని కాదనుకుంటున్నారు. ప్రేమ విఫలం అయితే హత్యలు, ఆత్మహత్యలు, యాసిడ్ దాడులకు తెగబడుతున్నారు. ఈ నేపథ్యంలో యువత ప్రేమకు వ్యామోహానికి మధ్య ఉన్న తేడా తెలుసుకోవాలి. శ్రేష్ఠమైన ఆవుపాలలో 87శాతం నీరు ఉంటుంది. మిగిలిన 13శాతంలో మాంసకృత్తులు, కొవ్వు, పిండిపదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అలాగే ప్రేమలో ఆశలు, ఆకాంక్షలు ఎక్కువగా కనిపించినప్పటికి మానవీయ విలువలు ఉండాలి. నమ్మకం, విశ్వాసం, త్యాగం, క్షమ, సాన్నిహిత్యం, ఆదరణ, అనురాగంలాంటి అంశాలు ప్రేమకు మూలాలు. ఆశ, కోర్కె, తపన, వాంఛ, కసి, క్రోధ, పగ, ప్రతీకారం వ్యామోహానికి ప్రేరకాలుగా మారుతాయి. ప్రేమలో త్యాగం ఉంటే వ్యామోహంలో ప్రతీకారం ఉంటుంది. ఈరెండు అంశాల సీత, శూర్పణఖ జీవితాలను విశ్లేషిస్తే అర్థం అవుతుంది. ప్రేమ మనసును ఉత్సాహపరిస్తే, వ్యామోహం శరీరంలో ప్రేరణ కలిగిస్తుంది. ప్రేమ భరోసా నింపుతుంది.

వ్యామోహం కోర్కెను రగిలిస్తుంది. ఒకరిని ఒకరు ఇష్టపడ్డ ఒక జంట పక్కపక్కన కూర్చుంటే మనసు ఆనందపడితే అది ప్రేమ. అలా కాకుండా శరీరం వేడెక్కి, గుండెవేగం పెరిగి శారీరక ధర్మాలలో మార్పులు వస్తే అది వ్యామోహం. కొంతమంది వ్యామోహాన్ని సామర్థ్యంగా భ్రమిస్తారు. అది పూర్తిగా తప్పుడు భావన సామర్థ్యానికి ఓర్పు, సహనం, నియంత్ర, నిబద్ధత ఉంటుంది. వ్యామోహంలో ఇవి కనిపించవు. అందుకే ప్రేమ ఒక అచంచలమైన మానసిక అనుభూతి. ఇది ఒక క్షణం పెరిగి, మరొక క్షణంలో తగ్గదు. కబీర అన్నట్టు 'హృదయంలో నిశ్చలంగా జీవితాంతం ఉండే ఆత్మీయభావనే ప్రేమ. ఇప్పటివరకు చర్చించుకున్న ప్రేమ ఒక స్త్రీ మరొక పురుషుని మధ్య ఉన్న అనుభూతికి సంబంధించినది మాత్రమే. విశ్వజనీనమైన ప్రేమ, తల్లిప్రేమ లాంటివి వేరు.



### వ్యామోహం వద్దు

వ్యామోహం వినాశ హేతువు అంటారు. అధర్మమని తెలిసి కోర్కె తీర్చుకోవడానికి విపరీతంగా తాపత్రయపడటమే వ్యామోహం అంటే. ఒకవిధంగా చెప్పాలంటే హద్దుమీరిన ప్రేమను వ్యామోహం అనవచ్చు. వ్యామోహాన్ని మానసిక బలహీనత లేదా ఉద్వేగలోపంగా చెప్పవచ్చు. సమాజంలో పలురకాల వ్యామోహాలు ఉన్నాయి. ధన వ్యామోహం, పదవీ వ్యామోహం, పరస్త్రీ లేదా పరపురుష వ్యామోహం లాంటివి ఉదాహరణగా చెప్పవచ్చు. జీవితంలో ఉన్నత స్థితిని సాధించాలంటే గుణసంపదను పెంచుకోవాలి. అలాగే అంతర్గత శత్రువులైన రిషడ్వర్గాలను జయించాలి. అరిషడ్వర్గాలు అంటే కామం, క్రోధం, లోభం, మోహం, మదం అన్న ఆరు దుర్గాణాలు. వ్యామోహపరుల్లో ఈ ఆరు దుర్గుణాలు ఉంటాయి. ఎంతటి గొప్ప వ్యక్తి అయినా వ్యామోహానికి గురైతే పతనం తప్పదు అనడానికి లంకేశ్వరుడైన రావణాసురుడిని చెప్పవచ్చు. ఆయనను రావణ బ్రహ్మ అంటారు. ఆయన మహాపండితుడు, రాజనీతిజ్ఞుడు, ధర్మసూక్ష్మాలను ఎరిగినవాడు. పైగా గొప్ప శివభక్తుడు. అయినా పరస్త్రీ వ్యామోహంతో సర్వం కోల్పోయాడు. ఇప్పుడు కొంతమంది గొప్పగా చదువుకుని, ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తూ అపరిపక్వ ప్రేమ పేరుతో పతనం అవుతున్నారు. డాక్టరు చదువుకున్న ఒక యువతి లేక యువకుడు. ఒక ఆటో డ్రైవరును లేదా పదవ తరగతి ఫెయిలయిన అమ్మాయిని ప్రేమించావంటే అర్థం ఉందా? దీనిని ప్రేమని ఎవరైనా అంటారా? సోషల్‌మీడియాలో పరిచయమైన ముక్కు, మొహం తెలియని వారికోసం తపించడాన్ని వ్యామోహం అనక ప్రేమని చెప్పగలమా? పరిపక్వమైన ప్రేమను ప్రతివారు గౌరవిస్తారు. తల్లిదండ్రులుకూడా సమ్మతిస్తారు. అపరిపక్వ, వ్యామోహపూరిత ప్రేమలను అందరూ తప్పుపడతారు. తల్లిదండ్రులు తిరస్కరిస్తారు. ఈ సున్నితమైన అంశాన్ని యువతీయువకులు గుర్తించాలి. వ్యామోహాలకు గురికాకుండా మనసును అదుపులో పెట్టుకోవాలి. కొందరిలో హార్మోన్ల లోపాలు కూడా వ్యామోహానికి ప్రేరకంగా మారతాయి. శృంగార కోర్కెలకు కారణమైన కొన్ని హార్మోన్లు అతిగా స్రవించడం వల్ల తాపం పెరుగుతుంది. కొందరిలో ఈతరహా ఉన్మాదం తలెత్తుతుంది. కొందరిలో సైకోసిస్ లక్షణాలు ఉంటాయి. ప్రేమ పేరుతో చేతులు కోసుకునేవారు, తలబాదుకునేవారు, డిప్రెషన్‌కు గురయ్యేవారిలో మానసిక రుగ్మతలు ఉన్నట్టు భావించాలి. ప్రేమ పేరుతో హత్యలు చేసేవారు, యాసిడ్ దాడులకు పాల్పడే వారిలో అసాంఘిక వ్యక్తిత్వం, హింసాప్రవృత్తి ఉంటుంది. కొందరిలో కాండక్ట డిజార్డర్ ఉంటుంది. పూర్వం రోజుల్లో ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని ఏవో ఆత్మలు ఆవహించాయని లేదా దెయ్యం పట్టిందని అనేవారు. ఏవో క్షుద్రపూజలు చేసేవారు. ఇప్పుడు చక్కని కౌన్సెలింగ్ పద్ధతులు, చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి మితిమీరిన వ్యామోహం ఉన్నవారు మానసిక నిపుణులను కలవడం మంచిది. మన శరీర ఉష్ణోగ్రత పెరిగితే జ్వరం అంటారు. అలాగే ప్రేమ శృతిమించితే వ్యామోహం అనక తప్పదు. ఎవరికి వారు తమలో రగిలే కోర్కెలను గుర్తించి నియంత్రించుకోవాలి.



### లక్ష్యం కావాలి

ప్రతి వ్యక్తికి ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. వారివారి పరిస్థితులు, అవకాశాలు, విద్యార్హతలు, తెలివితేటలను బట్టి లక్ష్యాలను ఎంచుకుంటారు. అయితే ప్రతి వ్యక్తికి ప్రేమ పెళ్లి అన్నవి జీవిత లక్ష్యం కావాలి. ప్రతి వ్యక్తి ఉన్న స్థితి నుంచి అంతో, ఇంతో ఉన్నత స్థితికి ఎదగాలనుకుంటారు. ప్రతిదీ ఎంపిక చేసుకుంటారు. చదువు, చదివే స్కూలు, కాలేజీని ఎంపిక చేసుకుంటారు. చెప్పులు, బట్టలు, వాహనాలను తమకు తగిన విధంగా ఎంపిక చేసుకుంటారు. ఇంటి ఖాళీస్థలంలో పెంచే మొక్కల పట్ల జాగ్రత్త తీసుకుంటారు. ఇవన్నీ కొన్నాళ్లపాటు ఉంటాయి. ఐఎఎస్, ఐపిఎస్ ఉద్యోగాలు అయినా విరమణ తప్పదు. పెళ్లి జీవితకాలం కొనసాగే పవిత్ర అంశం. వంశాభివృద్ధి అందులో కీలకం. సామాజిక గౌరవం కూడా ప్రధానం. చెప్పులు సైజు ఎక్కువ అయినా, తక్కువ అయినా నడక కష్టం అవుతుంది. అలాగే దాంపత్యం కూడా అన్నది గుర్తించాలి. చదువు, ఉద్యోగం, సంపాదన, కుటుంబం, ఎత్తు, ఆరోగ్యం లాంటి పలు అంశాలు పరిగణించి ఎంపిక చేసుకుని ప్రేమించాలి. ఆ ప్రేమను కొనసాగించాలి. జీవితాన్ని సఫలం చేసుకోవాలి. ప్రేమను పవిత్రంగా భావించాలి. వ్యామోహం దరి చేరకుండా జాగ్రత్త పడాలి. ❑



కథ

# బుల్లెట్ బండారం

దామెర్ల సాయిబాబా

ఆ రోజు ఆదివారం కావడంతో పని తొందరగా అయిపోయింది. జిల్లా వ్యాప్తంగా కూడా వార్తలు పెద్దగా ఏమీ లేకపోవడంతో సాయంత్రం ఏడు గంటలకల్లా ఉన్న వార్తలు హైదరాబాద్‌కు ఫీడ్ చేసి టెలిప్రింటర్ (టెలిప్రింటర్ ద్వారా వార్తలు పంపించేవారు) క్లోజ్ చేసి అక్కడ ఉన్న పార్ట్ టైం రిపోర్టర్లు, ఆపరేటర్‌తో సహా అందరం కలిసి బయలుదేరడానికి సిద్ధమయ్యాం. ఇంతలో ఫోన్ మోగింది.


“ఫోన్ ఎత్తబాకండి సార్! ఈరోజు మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ మీటింగ్ అయ్యింది కదా! నా పేరు రాశారా, నేను మాట్లాడింది కూడా రెండు పాయింట్లు రాయండి అంటూ సాయంత్రం నుండి ఒకటే ఫోన్లు వస్తున్నాయి. ఇది కూడా అదే అయి ఉంటుంది. వెళ్లిపోదాం రండి” అన్నాడు మా పార్ట్ టైం రిపోర్టర్.

ఫోన్ అలాగే మోగుతోంది. ఎత్తాలా.. వద్దా అనే సంశయం. ఏమైనా ఇంపార్టెంట్ మెసేజ్ ఉందేమోనని అనుమానం. ముఖ్యంగా ఎన్‌కౌంటర్‌లో లేక ఏదైనా ముఖ్యమైన క్రైం ఉంటే మిస్ అయిపోతామనే భయంతో. ఒకవేళ కాంగ్రెస్ నాయకులైతే టైం అయిపోయింది క్లోజ్ చేసామని చెప్పవచ్చనే ధీమాతో “ఫోన్ ఎత్తుకోమని” ఆ పార్ట్ టైం రిపోర్టర్‌కే చెప్పా.

ఫోన్ ఎత్తి ఒక నిమిషం మాట్లాడి నా చేతికిచ్చాడు. “సార్, ఇక్కడ హోటల్లో ఏదో ఘోరం జరిగిపోతోంది. పోలీసులు, ఒక డాక్టర్ రోజూ తెల్లవారుఝామున ఒక రూమ్‌కి వచ్చి వెళుతున్నారు. వారు వచ్చి వెళ్లగానే రూమ్‌కు తాళం వేస్తున్నారు. లోపలికి ఎవరినీ రానీయడం లేదు” అంటూ హోటల్ పేరు, రూమ్ నంబర్ అన్నీ చెప్పి మరో అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసాడు.

మాకు అప్పుడప్పుడూ ఇలాంటి ఫోన్లు రావడం అలవాటే కనుక అది పెద్దగా సీరియస్‌గా తీసుకోకుండా వదిలేశాం. సోమవారం సాయంత్రం మళ్లీ అదే వ్యక్తి ఫోన్ చేశారు.

“నేను చెప్తున్నదంతా నిజం. మీరు నమ్మడం లేదు. ఒక ప్రాణాన్ని కాపాడండి” అంటూ ఫోన్లోనే ప్రాధేయపడ్డాడు.



ఇంతలో అక్కడికి మరో పత్రిక జిల్లా విలేకరి వచ్చారు. ఆయన వస్తూనే “ఎవడో ప్రాణాలు కాపాడండి అంటూ ప్రాణం తీస్తున్నాడు” అంటూ తనకొచ్చిన ఫోన్ గురించి కూడా చెప్పాడు.

అంతేకాక తాను వెళ్లి చూశానని అక్కడ ఏమీ లేదని చెప్పడంతో నేను కూడా ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను. నాలుగైదు రోజులు గడిచిన తరువాత మళ్లీ ఫోన్ వచ్చింది. ఈసారి ఆఫీసుకు కాకుండా ఇంటి నంబర్ తెలుసుకుని చేశారు. “పోలీసులు ఎప్పుడు వస్తున్నారో, ఏ రూమ్‌లో ఉంటున్నారో తదితర వివరాలన్నీ చెప్పి ఆ టైమ్‌లో “ఒక్కసారి పరిశీలించండి.. మీరు వార్త రాయకపోయినా ఫర్వాలేదు. మీరు వెళితే ఒక ప్రాణం దక్కుతుంది. మళ్లీ మళ్లీ ఫోన్ చేసి విసిగించను” అంటూ ప్రాధేయపడ్డాడు.

శనివారం తెల్లవారుఝామున ఆ వ్యక్తి చెప్పిన సమయానికి పార్ట్ టైం విలేకరితో వెళ్లి హోటల్‌ముందు ఉన్న లాన్స్‌లో ఎవ్వరికీ కనపడకుండా కూర్చున్నాం. సరిగ్గా ఉదయం 5 గంటల సమయంలో ఒక ఎస్.ఐ, డాక్టర్ వారి వెంట మరో వ్యక్తి. ముగ్గురూ కలిసి ఆ రూమ్‌లోకి వెళ్లి దాదాపు ఒక గంటసేపు గడిపి బయటకు వచ్చారు. గదితాళం వేసుకుని మరీ వెళ్లారు.

ఇక మాకు టెన్షన్ పెరిగింది. “వాళ్లు రూమ్‌లోకి వెళ్లి ఏం చేశారు? రూమ్‌లో ఎవరున్నారు? ఎవరైనా తీవ్రవాదులుంటే ఇంటరాగేషన్ చేయాలనుకుంటే అక్కడికెందుకు వెడతారు? ఎక్కడో పోలీస్ స్టేషన్‌లో పెట్టొచ్చు. లేదా క్రైం స్టేషన్‌లో పెట్టవచ్చు లేక డాక్టర్ వస్తున్నారు కనుక కొట్టిన దెబ్బలు బాగు చేసేందుకు అనుకుంటే రహస్యంగా ఏదైనా ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించవచ్చు” అలా రకరకాల ఆలోచనలు వచ్చాయి. ఇంతకూ లోపల ఎవరున్నారో తెలియడం లేదు. ఎంత ఆలోచించినా సరైన సమాధానం దొరకడం లేదు.

వెనుతిరిగి వచ్చామే కానీ అదే ఆలోచన చివరకు రూమ్ ఎవరి పేరు మీద ఉందో తెల్సుకుంటే లోపల ఉన్న వ్యక్తి వివరాలు కొంతైనా తెలిసి అసలు కథ బయటకు వస్తుందని ఆ కోణంలో ప్రయత్నించి అతి కష్టం మీద హోటల్ రికార్డు సంపాదించగలిగాం. “మంగపతి, కామారెడ్డి” అని రాసి వుంది. దీంతో క్లూ దొరికిందన్న సంతోషం ఎక్కువసేపు నిలువలేదు. ఆ రికార్డు ద్వారా అంతకంటే వివరాలేమీ లభించలేదు. లోపలున్న వ్యక్తి అసలు పేరు అవునో కాదో కూడా తెలియదు. రూమ్ సర్వీసు చేస్తున్న బాయ్‌ని పట్టుకుంటే ఏదైనా సమాచారం తెలుస్తుందని ఈసారి ఆ కోణంలో మా ప్రయత్నాలు ప్రారంభించాం. గదిలోకి వెళ్లి వచ్చే బాయ్ మాతో మాట్లాడటానికే భయపడుతున్నాడు. మేం కలిస్తే మాతో ఉండగా తనను ఎవరైనా చూస్తారేమోనని బిత్తర చూపులు చూస్తున్నాడు.

ఇక ఇక్కడ ప్రయోజనం లేదని బాయ్ ఇంటి అడ్రస్ కనుక్కొని అతని అలవాట్లు తెలుసుకుని అతడికి ఇష్టమైన విస్కీ తీసుకుని బయలుదేరాం.

మమ్మల్ని చూడగానే మళ్లీ ఇక్కడకు ఎందుకు వచ్చారన్నట్లు చూశాడు. కొంతసేపు మాట్లాడిన తరువాత మేం తెచ్చిన ఫుల్ బాటిల్ అతనికి అందించిన పిదప నోరు మెదపడం మొదలు పెట్టాడు. "ఎవరో ఏమో సార్, 30 ఏళ్ల యువకుడు ఉన్నాడు. ఆయనకు అన్నీ తినిపిస్తున్నారు. అతనేమో ఒక్కోసారి తినని మొండికేస్తున్నాడు" రూమ్ బాయ్ చెప్పాడు.

"ఏమైనా దెబ్బలు కొట్టారా? దెబ్బల గుర్తులు ఉన్నాయా?"

"అలాంటివి ఏమీ లేవు సార్"

"అయితే డాక్టర్ ఎందుకు వస్తున్నాడు?"

"ఏవో పరీక్షలు చేస్తున్నారు"

"ఏం పరీక్షలు చేస్తున్నారు?"

"ఏమో సార్, నాకు తెలియదు"

"బీర్‌తో సహా భోజనం అంతా రూమ్‌లోనే ఏర్పాటు చేస్తున్నాం. ఈ విషయం నేను మీకు చెప్పినట్లు తెలిసినా పోలీసులు నన్ను బతకనివ్వరు"

"అలా బెదిరించారా?"

"బెదిరించడం కాదు సార్. ఏమాత్రం బయటకు పొక్కినా భార్య బిడ్డలకు కరువైపోతావు, ఎన్‌కౌంటర్ల సంగతి తెల్సు కదా!" అని హెచ్చరించారు సార్. అయినా అదంతా ఎందుకులెండి" అంటూ ముగించాడు.

తర్జన భర్జనల అనంతరం ఒక నిర్ణయానికి వచ్చాను. మా సహచర విలేకరిని తీసుకుని డాక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ రూమ్‌లోకి వెళుతున్న సమయంలో వారి వెంటనే నేనూ లోపలికి బలవంతంగా వెళ్లాలని నిశ్చయించుకున్నాను. మా విలేకరి బయట ఉండి 15 ఇరవై నిమిషాల వరకు నేను బయటకి రాకపోతే అందరు పోలీసులకు, మిగిలిన పత్రికా విలేకరులకు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫోన్ చేసి నన్ను బయటకు తీసుకువచ్చే బాధ్యత ఆయనకు అప్పగించాను.

జిల్లా కలెక్టర్‌కు వివరాలేమీ చెప్పకుండా అవసరమైతే మా రిపోర్టర్ ఫోన్ చేస్తారని సహాయం చేయాల్సిందిగా ముందుగానే కోరాం. అంతా రెడీ అయ్యాం. అనుకున్న సమయానికే డాక్టర్, ఎస్.ఐ, మరో వ్యక్తి రావడం, వారు రూమ్‌లోకి వెళ్లడం జరిగింది.

నేను లాన్స్ నుండి రూమ్ వద్దకు చేరుకునే సరికే లోపలి నుండి గడియ పెట్టుకున్నారు. మళ్లీ మా ప్రయత్నం ఫలించలేదని నిరాశతో ఉన్న సమయంలో రూమ్ బాయ్ గుర్తుకు వచ్చాడు. ఆయన కోసం వెదికితే డ్యూటీకి రాలేదని చెప్పారు. దీంతో ఆరోజు ప్రయత్నం ఫలించలేదు. మళ్లీ రూమ్ బాయ్ ఇంటికి వెళ్లి ఆయనకు ధైర్యం చెప్పి ఏ పరిస్థితుల్లోనూ ఏమీ కాదని అయినా నీకు తెలియకుండానే జరిగిందని చెప్పమని కోరి మరో పథకం సిద్ధం చేశాం.

"ఏమైనా దెబ్బలు కొట్టారా? దెబ్బల గుర్తులు ఉన్నాయా?"
"అలాంటివి ఏమీ లేవు సార్"
"అయితే డాక్టర్ ఎందుకు వస్తున్నాడు?"
"ఏవో పరీక్షలు చేస్తున్నారు"
"ఏం పరీక్షలు చేస్తున్నారు?"

మరుసటి రోజు తెల్లవారుఝామున 4 గంటలకే ఆ ప్రాంతానికి చేరుకున్నాం. డాక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెళ్లగానే వారి వెంట రూమ్ బాయ్ కూడా వెళ్లారు. రూమ్ క్లీన్ చేసి రూమ్ బాయ్ బయటికి రాగానే వారు లోపలి నుండి బోల్ట్ పెట్టారు.

మా పథకం ప్రకారం బాయ్ వెళ్లి తలుపు కొట్టాడు.

"ఎవరు?"

"నేను రూం బాయ్‌ని సార్"

"ఏం కావాలి?"

"బాత్‌రూంలో చీపురు, డబ్బా మరిచిపోయాను సార్"

బోల్టు తీశారు. అవి తీసుకునేందుకు బాయ్ లోపలికి వెళ్లాడు.

మరో క్షణం ఆలస్యం చేయకుండా ఆయన వెంట నేను కూడా లోపలికి జొరపడ్డాను. బయట నుండి వెళ్లినవారు కాక మరో వ్యక్తి ఆ రూమ్‌లో ఉన్నాడు. నన్ను చూడగానే సబ్ ఇన్‌స్పెక్టర్ నిశ్చేష్టుడైపోయాడు. నాకు పరిచయం వున్న వ్యక్తి కనుక ఏమీ అనలేకపోయాడు. పైగా నేను అన్నీ తెలుసుకుని అక్కడకు వచ్చాననుకుంటున్నాడు. వాస్తవంగా నాకేమీ తెలియదు. ఆ విషయం చెప్పలేను. చెబితే ఏదో అబద్ధం చెప్పి నన్ను బయటకు పంపుతారేమో! ఈ పరిస్థితుల్లో అన్నీ తెలిసినవాడిలాగానే మౌనంగా ఉండిపోయాను.

"నేను కావాలని చేసింది కాదిది, పొరపాటున ఇందులో ఇరుక్కుపోయాను. నాకు తెలుసు.. మిమ్మల్ని ఎవరు పంపారో. దయచేసి ఇది బయట పెట్టొద్దు. మీకు చేతులెత్తి దండం పెడతాను. నా కెరియర్ మొత్తం చెడిపోతుంది" అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రాధేయపడటం మొదలు పెట్టాడు.

నాకేమీ అర్థం కావడం లేదు. కానీ ఆ విషయం సబ్ ఇన్‌స్పెక్టర్‌కు అర్థం అయితే నా పర్పస్ సర్వ్ కాదు. ఇది జరుగుతుండగానే నాకు బయట ఉన్న రిపోర్టర్ విషయం గుర్తుకు వచ్చింది. ఆ విషయం సబ్ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పి

"విలేకరిని ఆఫీసుకు పంపించి వస్తాను. లేకపోతే పత్రికల్లో రాకముందే బయట ప్రపంచానికంతా తెల్సి పోతుంది. ఇంకా ఆలస్యం చేస్తే జిల్లా కలెక్టర్ కూడా ఇక్కడకు రావచ్చని" ఉన్న విషయం చెప్పాను.

దీంతో నాతో పాటే ఆ సబ్ ఇన్‌స్పెక్టర్ కూడా బయటకు వచ్చాడు. ఆ రిపోర్టర్‌కు చెప్పి, నేను మరో గంటలో వస్తానని ఆఫీసుకు పంపించాను. మళ్లీ ఇద్దరం రూమ్‌లోకి చేరాం.

"నాకు చాలా చెడ్డ రోజులు సార్. నేను చేయని వాటిల్లో ఇరుక్కుపోతున్నాను" అంటూ వేదాంతంలోకి దిగారు సబ్ ఇన్‌స్పెక్టర్.

డాక్టర్ కూడా అదే మాట మాట్లాడుతున్నాడు. డాక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు వచ్చిన వ్యక్తి బి.పి. బెల్టు కడుతున్నాడు. ఇతరత్రా వైద్య పరమైన సేవలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు.

ఆ అపరిచిత వ్యక్తి కూడా ఏమీ మాట్లాడటం లేదు.

"ఇంతవరకు వచ్చిన తరువాత మీ వద్ద దాచడం ఎందుకు? వాస్తవ విషయాలు చెపుతాను. తరువాత మీ నిర్ణయానికే వదిలిపెడతాను. కానీ మీ వద్ద నుండి ఒకటి ఆశిస్తున్నాను. మీకు నేను అన్యాయం చేశాననిపిస్తే ఏమైనా రాయండి. కానీ నేనిందులో అమాయకంగా ఇరుక్కున్నాననుకుంటే నాకన్యాయం చేయకండి" అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రాధేయపడ్డాడు.

"సరే చెప్పండి.." అన్నాను గంభీరంగా ఏమాత్రం ఊహాకందని ఆ ఉదంతాన్ని గురించి ఎస్ఐ చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.

.............

"రూమ్‌లో ఉండి వైద్యసేవలు పొందుతున్నవాడి పేరు నారాయణ. చిల్లర దొంగతనాలు చేస్తూ ముఖ్యంగా వేములవాడ వెళ్లే బస్సుల్లో జేబులు కొట్టడం, గొలుసులు కత్తిరించడం లాంటి వాటితో జీవనం గడుపుతుంటాడు.

విచిత్రంగా అనిపించినా డైరీ రాయడం వీడికి అలవాటు. తానెక్కడ దొంగతనం చేసిందీ, వాటిని ఎక్కడ అమ్మిందీ అన్నీ వివరంగా డైరీలో రాస్తాడు. డబ్బు కూడా బ్యాంక్‌లో వేసుకుంటాడు. బ్యాంక్ బ్యాలెన్స్ ఐదు వందలకో, వెయ్యికో వచ్చినప్పుడు కానీ మళ్లీ దొంగతనం చేయడు. వారానికి రెండు సినిమాలు, మూడు సార్లు నాన్ వెజిటేరియన్.. ఇలా ఒక రకమైన ప్రిన్సిపుల్ దొంగనే చెప్పొచ్చు. పోలీసులకు ఏదైనా కేసులో దొరికితే కొట్టి ఇంటరాగేట్ చేయాల్సిన పని ఉండదు. తన డైరీ ఇచ్చేస్తాడు. అందులో అన్ని వివరాలు ఉంటాయి. సహజంగా యాత్రికులు ఫిర్యాదులు చేయడానికి ఇష్టపడరు. ఫిర్యాదు ఇస్తే పోయిన సొమ్ము ఎలాగూ దొరకదు. పైగా పోలీస్ స్టేషన్ చుట్టూ ఎక్కడో దూరంగా ఉన్న స్వగ్రామాల నుండి తిరగాల్సి వస్తుంది. అందుకే మన నారాయణ యాత్రికుల వద్దనే దొంగతనాలు చేయడం ఎంచుకున్నాడు.



ఇది ఇలా సాగుతుండగా, పట్టణంలోని ఒక రాజకీయ నాయకుడి ఇంట్లో ఒక రాత్రి దొంగతనం జరిగింది. పదిహేను వేల రూపాయల విలువ చేసే బంగారు గొలుసు దొంగిలించారు. దీంతో ఆ నాయకుడికి అప్పుడున్న పోలీసు ఉన్నతాధికారులు బాగా దగ్గర కావడంతో మాపై వత్తిడి పెరిగి అది రికవరీ చేసే బాధ్యత నాపై పడింది. ఈ లోగా 9 వేల రూపాయల విలువైన ఒక గొలుసు బస్సులో ఉన్న ఒక మహిళ నుండి కొట్టివేసి నారాయణ పట్టుపడ్డాడు.

అయితే ఆ గొలుసు పోగొట్టుకున్న మహిళ ఫిర్యాదు చేయలేదు.

దీంతో మా హెడ్ కానిస్టేబుల్ సలహా మేరకు మిగిలిన ఆరు వేల రూపాయల బంగారం ఈ గొలుసుకు కలిపి ఆ నాయకుని ఇంట్లోంచి చోరీ అయిన గొలుసులాగానే చేయించి రికవరీ చూపించాం. అయితే అందులో దొంగను కోర్టుముందు నిలబెట్టాం కనుక నారాయణను అందుకు అంగీకరించమని కోరాను"

ఎస్.ఐ. మాటలకు అడ్డు తగులుతూ– "అందుకే ఇదంతా చేస్తున్నానని నన్ను నమ్మమంటారా?" అని ప్రశ్నించాను.

"లేదు.. అసలు విషయం చెపుతున్నాను" అంటూ ఎస్ఐ కథను మరో మలుపు తిప్పారు.

"దీనికి నారాయణ ససేమిరా అన్నాడు. నేను బస్సుల్లో మాత్రమే దొంగతనాలు చేస్తాను. ఇళ్లల్లో చేయనని మొండికేశాడు.

మేం "దొంగ దొరికాడు, సొమ్ము దొరికింది. ఒకటి రెండు రోజుల్లో కోర్టులో పెడుతున్నామని పై అధికారులకు చెప్పేశాం కూడా. వీడేమో ఒప్పుకోవడం లేదు. "ఎలాగూ నువ్వు దొంగతనం చేసావు. ఎక్కడనేది వేరే విషయం. సొమ్ము కూడా రికవరీ చేశాం. ఒప్పుకుంటే నీకు మంచిదంటూ" నయానా, భయానా నాలుగైదు రోజులు నచ్చచెప్పినా కూడా వాడు వినలేదు. ఆరోజు సోమవారం ఉదయాన్నే పోలీస్ స్టేషన్‌కు వచ్చాను.

కోర్టుకు తీసుకుపోవాల్సిన సమయం వస్తోంది. పై అధికారులకు చెప్పాం. పదిన్నర గంటలకల్లా కోర్టులో ప్రవేశపెడుతున్నామని. కానీ ఆ సమయంలో కూడా వాడు మొండికేశాడు. ఆ టెన్షన్‌లో వాణ్ణి బాగా కొట్టాను. ఈలోగా వైర్‌లెస్ సెట్లో ఎవరో పిలవడంతో పోయి పది నిమిషాలు మాట్లాడి వచ్చాను. వాడెన్ని దెబ్బలు తిన్నా పట్టు వదలలేదు. సరే! వీడి సంగతి తరువాత చూద్దాం. వేరే దొంగల్ని ఎవరినైనా చూడండి, కోర్టుకు పంపే ఏర్పాటు చేయమని మా హెడ్ కానిస్టేబుల్‌ను గదమాయించాను. ఈలోగా టేబుల్‌పై వున్న రివాల్వర్‌లో బుల్లెట్లు కనిపించలేదు. దీంతో ఇంటి దగ్గర పడిపోయాయేమోనన్న అనుమానంతో ఇంటికి మనిషిని పంపించి వెతికించాం. పోలీస్ స్టేషనంతా వెతికాం. "ఎక్కడైనా పడిపోతే ఒకటీ రెండు పోతాయేమో కానీ అన్నీ పోతాయా?" అన్న అనుమానాలు మరొక పక్క. పై అధికారులకు తెలిస్తే నెగ్లిజెన్సీ కింద సస్పెండ్ చేస్తారనే భయం ఉక్కిరి బిక్కిరి చేసింది. హెడ్ కానిస్టేబుల్ వచ్చి "మీ రూమ్‌లో ఎవ్వరూ లేరు సార్ ఈ నారాయణ తప్ప. వాడ్ని అడిగి చూడండి" అంటూ సలహా ఇచ్చాడు. నారాయణను "పిలిచి బుల్లెట్లు ఏమైనా కనిపించాయా?" అనడిగా.

"నాకేం తెలుసని సమాధానమిచ్చాడు. కొంతసేపు ప్రశ్నించిన తరువాత ఎందుకో వాడి మీదనే అనుమానం పెరిగింది. వాడు భయాన ఏదీ చెప్పడనే విషయం ముందుగానే అర్థమైంది. కనుక వాడ్ని నయాన్నే దారికి రప్పించే ప్రయత్నం చేశాను.

ఒక దశలో "నన్నెందుకు కొట్టావు? నేను చేయని దొంగతనం నన్నెందుకు ఒప్పుకోమని అంటున్నావు?" అంటూ నారాయణే నన్ను ప్రశ్నించాడు.

"అదంతా అయిపోయింది కదా. వేరే దొంగను పంపాను కదా, ఇప్పుడెందుకు? నా బుల్లెట్ల సంగతి చెప్పు" అన్నాను.

"ముందు తప్పైందని నువ్వు చెపితే, ఆ తరువాతే బుల్లెట్ల సంగతి చెపుతాను" అంటూ మొండికేసాడు.

"దొంగకు తప్పైందని నేను చెప్పడమేమిటి?"

"నేను ఏం చేయాలనే స్థితిలో ఉండగా మా హెడ్ కానిస్టేబుల్ వచ్చి "ఒక మాట చెప్పండి సార్, బుల్లెట్లు మన చేతికి వచ్చిన తరువాత వాడి సంగతి చూద్దాం" అంటూ నా చెవిలో వూదాడు. నాక్కూడా అంతకంటే మార్గం కనిపించలేదు. బుల్లెట్లు పోయిన విషయం బయటికి పొక్కితే ముందు నా ఉద్యోగానికి ముప్పు వస్తుంది. ఈ భయంతో వాడి చేతులు పట్టుకుని తప్పైందని చెప్పుకున్నాను. మళ్లీ "ఎప్పుడూ కొట్టరు కదా" అని వాడి ప్రశ్న.

"లేదురా ఎప్పుడూ కొట్టను, నీకు దండం పెడతాను, నా బుల్లెట్లు నాకిచ్చేయరా" రెండు చేతులెత్తి దాదాపు ప్రాధేయపడ్డాను. అప్పుడు వాడు అటూ ఇటూ చూసి తన కడుపు చూపించాడు.

"ఏందిరా?" అంటూ "మింగేశానని" చెప్పాడు.

మళ్లీ ఏం చేయాలో తెలియకుండా పోయింది. ఇక్కడైతే పరిస్థితి బాగుండదని, హైదరాబాద్ తీసుకెళ్లాం. అక్కడ డాక్టర్ అన్ని పరీక్షలు జరిపిన తరువాత ఆపరేషన్ చేయడం అంత మంచిది కాదని, మోషన్ ద్వారా పడిపోతుందని సలహా ఇచ్చారు.

బాగా తినిపించి ఎనిమా ఇస్తే ఆ ప్రెషర్‌లో బయటికి వస్తాయని చెప్పాడు. వాడికి తినిపించడం, తెల్లవారుఝామున వాడు మోషన్ బాగా ప్రెజర్‌గా వచ్చే విధంగా ఎనిమా ఇవ్వడం మోషన్ అంతా ఒక డబ్బాలోకి పట్టడం, అందులో బుల్లెట్లు ఉన్నాయా? లేవా? అని వెతకడం, ఆ వెతికేందుకే హాస్పిటల్‌లో క్లీనర్‌గా వున్న వ్యక్తిని తెస్తున్నాం.

ఇప్పటికి 20 రోజులైంది. మూడు బుల్లెట్లు పడిపోయాయి. ఇంకా మూడున్నాయి. ఎప్పుడు వస్తాయో తెలియదు. బీరు, పాలకూర లాంటివి తింటే లూజ్ మోషన్ ద్వారా బయట పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని డాక్టర్లు చెపుతున్నారు. వీడేమో చికెన్, మటన్ కావాలంటాడు. అది కూడా ఫుల్లుగా తినడు. బతిమిలాడి తినిపిస్తున్నాం. మంగళవారం ఉపవాసమంటాడు. శనివారం ఒకటే పూట తింటాడు. నా ప్రాణాలు పోతున్నాయి. ఏం చేయాలో తెలియడం లేదు. ఆ బుల్లెట్లు ఎప్పుడు పడిపోతాయనేదే నా తాపత్రయం. ఇందులో నా తప్పుంటే చెప్పండి" అంటూ ముగించాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

అక్కడున్న నారాయణ కల్పించుకుని "కొట్టడం తప్పు కాదా?" అంటూ ప్రశ్నించాడు.

"తప్పేరా.. ఈ సారుకు ఉన్న విషయం చెపుతున్నా" అంటూ సముదాయించాడు.

"ఎందుకు బుల్లెట్లు మింగావని" నారాయణను సూటిగా ప్రశ్నించాను.

"నేను బస్సుల్లో పిక్‌పాకెట్ చేసేవాడ్నే. ఆ విషయం అమీన్‌సాబ్‌కు తెలుసు. కావాలని ఎవడో ఇంట్లో దోపిడీ జరిగితే అందులో నన్ను ఒప్పుకోమని చెప్పాడు. చెప్తే చెప్పాడు. కొట్టడమేమిటి? కాలుతో కూడా తన్నాడు. ఆయన అలా తన్ని లోపలి రూమ్‌కు వెళ్లగానే అక్కడ టేబుల్ మీద గ్లాసులో మంచినీళ్లు ఉన్నాయి. బాగా దాహంగా ఉన్న నేను అక్కడికి వెళ్లేందుకు కూడా దెబ్బల వల్ల ఇబ్బంది పడి సరిగా నడవలేకపోయాను. ఎలాగో ఆ టేబుల్ వద్దకు పోయి చూస్తే రివాల్వర్ కనిపించింది. అందులో బుల్లెట్లు ఉన్నాయి. కసితో బుల్లెట్లు ఒక్కొక్కటి గొంతులో వేసుకుంటూ మంచినీళ్లు తాగాను. రివాల్వర్‌ను కూడా మాయం చేద్దామని చూశాను. కానీ అవకాశం లేదు. బుల్లెట్ల కోసం నన్ను కూడా సోదా చేశారు. అసలు నేను చెప్పకూడదనే అనుకున్నాను. నేను పడిన బాధ ఆయన కూడా అనుభవించాలనుకున్నాను. కానీ ఆయన తప్పయిందని చెప్పి నా చేతులు పట్టుకుని ఉద్యోగం పోతుందని బాధపడిన తరువాత చెప్పకుండా ఉండలేకపోయాను".

కథంతా విన్న తరువాత ఏం చేయాలో నాకర్థం కాకుండా పోయింది. హెడ్డాఫీస్‌తో మాట్లాడి మా ఎడిటర్ గారికి చెప్పాను. ఆయన "ఇందులో ఎవరికీ నష్టం లేదు కదరా అబ్బాయ్. అయితే వదిలేయ్" అన్నారు. "ఆ తరువాత రెండు నెలలకు మరో రెండు బుల్లెట్లు పడిపోయాయని, ఒక బుల్లెట్ ఇప్పటికీ వాడి కడుపులోనే ఉందని సబ్ ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. ఇప్పటివరకు 60-70 వేలు ఖర్చయింది. అయినా అప్పుడప్పుడు నారాయణ వచ్చి పదో పరకో అప్పు అడుగుతుంటాడు. ఎందుకైనా మంచిదని అక్కడ్నించి బదిలీ చేయించుకుని వేరే ప్రాంతానికి వచ్చేశానని" ఆ ఇన్‌స్పెక్టర్ వాపోయాడు. ◆




## స్వయంగా చేసాను

భర్త: మొన్నటిదాకా వంటల్లో ఉప్పు, కారం సరిగ్గా వేసేదానివి కాదు. కానీ రెండు రోజుల నుండి వుంట బాగా చేస్తున్నావు వెరీ గుడ్.

భార్య: నా సెల్‌ఫోన్ పాడైంది. అందుకే వంటలు బాగుంటున్నాయి.

భర్త: సెల్‌ఫోన్‌కి వంటకి సంబంధం ఏంటి?

భార్య: సెల్‌ఫోన్‌లో వంటలను తయారు చెయ్యడం చూసి మొన్నటిదాకా చేసాను. ఇప్పుడు ఫోన్ లేదు కదా!

## కుడి కన్ను బాగాలేదు

ప్రయాణికుడు: ఈ బస్సులో ముందు భాగం సీట్లు ఖాళీగా ఉన్నాయేంటి? ఎవరూ ముందు కూర్చోవడం లేదెందుకు?

కండక్టర్: డ్రైవర్‌కు కుడికన్ను లేదు. ఎడమ కన్ను మాత్రమే ఉంది. ఒకవేళ యాక్సిడెంట్స్ అయితే బస్ ముందు భాగం ఎక్కువగా దెబ్బ తింటుంది కదా! అందుకే ముందు ఎవరూ కూర్చోరు.

## సహవాసం

భార్య: టామీని తీసుకుని వాకింగ్ వెళ్లి చాలాసేపైంది. ఇంతసేపు ఏం చేస్తున్నారు?

సుబ్బారావు: పక్కింటాయన కూడా కుక్కని తీసుకుని వాకింగ్‌కి వచ్చాడు.

భార్య: అయితే?

సుబ్బారావు: ఆయనది ఆడకుక్క. మనది కుక్క. రెండూ అక్కడి నుండి కదలట్లేదు.

## సీసాలు అతికిస్తే..

పేషెంట్: ఈ మధ్య రాత్రిళ్లు ఇంటి తలుపు ఎవరో కొడుతున్నట్లుగా అనిపిస్తుంది. తీరా తెరిచి చూస్తే అక్కడ ఎవరూ ఉండట్లేదు.

డాక్టర్: నువ్వు అర్జెంటుగా కొన్ని పాత సీసాలు సేకరించు.

పేషెంట్: సీసాలు ఎందుకు?

డాక్టర్: వాటిని పగలగొట్టి ఆ ముక్కలను తలుపుకు అతికించు. అప్పుడు తలుపు అర్ధరాత్రి ఎవరూ కొట్టరు.

**- ఎస్.కె.యాకుబ్‌పాషా,** ఖమ్మం

## ఖర్చులో ....

టీచర్: చింటూ, వెనుకడుగు వెయ్యను.. అనే మాటకు ఒక వాక్యం



చెప్పు.

చింటు: మీరు ఏభై రూపాయల నోటు ఇస్తే నేను ఖర్చు పెట్టడానికి వెనుకడుగు వెయ్యను.

## కాస్త రుచిగా..

యాచకుడు: చప్పిడి కూరలు తినలేకపోతున్నాను. కూరల్లో కొంచెం ఉప్పు, కారం వెయ్యండమ్మా.

గృహిణి: ఆ... అంటూ నోరెళ్లబెట్టింది.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

**sunmagvaartha@gmail.com**

# 'కొడవటిగంటి' సాహితీ ప్రయోజనం

**సాహిత్యానికి సాంఘిక ప్రయోజనం ఉండాలని కదిలించే సాహిత్యాన్ని సృష్టించిన రచయితలు తెలుగులో అరుదుగా వున్నారు. వారిలో కొడవటిగంటి కుటుంబరావు, జీవితాన్ని కళాత్మక వాస్తవికతతో దర్శింపచేసిన రచయితగా నవలలు, చిన్న కథలు, శాస్త్ర విజ్ఞాన కాల్పనిక కథలు, అపూర్వ అపరాధ పరిశోధనా కథలు, హాస్య, వ్యంగ్యోక్తికాలు, గల్పికలు, నాటికలు, స్కెచ్‌లు, నవలికలు, వ్యాసాలు సుమారు అయిదు దశాబ్దాలు పైగా రచనా వ్యాసంగంతో తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసారు.**

**జయసూర్య**

'చదువు' అనే నవల రాసిన కొడవటిగంటి, ఉత్తమ నవలిక ఎండమావులు, కమ్యూనిస్టు సిద్ధాంతాలపై అపార విశ్వాసంతో, హేతువాదిగా అరుణోదయం, అనామిక, అనుబంధం వంటి నవలల్లో, కథలలో మౌఢ్యాన్ని తూర్పారబట్టారు. రసరాట్టులో స్కెచ్‌లు, గల్పికలు అభూత కల్పనలతో రచనా శిల్పం పరాకాష్ఠ అందుకొంది. కొ.కు. పేరిట రాజకీయంగా మార్క్సిస్టు సానుభూతిపరుడైన కుటుంబరావు రాజకీయాలకు, సారస్వతానికి, సినిమాలకు సంబంధించినవి పలు వ్యాసాలు రాసారు. విజ్ఞాన శాస్త్రాన్ని అభిమానిస్తూ తెలుగులో సైన్సు ప్రగతి సంబంధిత పుస్తకాలు, వ్యాసాలు చైతన్యవంతమైన సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. సమసమాజ నిర్మాణం ఊపిరిగా సాహిత్య ప్రయోజనం ఆకాంక్షించే పరమ లక్ష్యంతో అసంఖ్యాక రచనలు వెలువరించారు.

తెలుగు సారస్వత వనంలో పిచ్చిమొక్కలు పిచ్చిగా తలయెత్తినపుడు మహాకవి గురజాడ అప్పారావు తోటమాలిగా పరిమళభరితమైన పువ్వులు పూయించారని, ఆ వనమాలి పోయాక మళ్లీ గుంటపూలే పూస్తున్నాయని హెచ్చరించారు. కుటుంబరావు రాసిన మంచి కథలు అసంఖ్యాకంగా ఆయన ఆలోచనా శైలి, శాస్త్రీయ దృక్పథం, అసమాన ప్రతిభను వ్యక్తం చేస్తున్నాయి. ప్రయోజన శూన్యమైన కాలక్షేపం కథలు, నవలలు, రచనలు ఆయన రాయలేదు.

'కురూపి' అనే ఉత్తమ కథలో సాహసంతో నూతన ప్రయోగం సైకో-ఎనాలిసిస్ గల్పికగా, నిజమైన ప్రేమ కురూపి, సౌందర్యాల మధ్య జనిస్తుందని అది ప్రేమో-కామమో మనమే తేల్చుకోవాలని చదువరులకు అసందిగ్ధంగా వదిలేయడం ఒక వినూత్న ప్రయోగం. వ్యక్తుల బలహీనతలు, భయాలు, అభిలాషలు, కోర్కెలు వాస్తవ సమాజాన్ని కథల రూపంలో కాలం కంటే ముందుగా తెలుగు సారస్వతంలో అపురూప రచనలు అందించారు.



సుమారు 30 నవలలు, కథలు, నాటికలు, అనువాదాలు ఆంధ్రపత్రిక సంపాదకత్వం, చందమామ, యువ వంటి పత్రికలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వర్తించారు.

పాశ్చాత్య సాహిత్య పరిచయం, శాస్త్రీయ విజ్ఞానం ప్రభావంతో రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన కొడవటిగంటి కుటుంబరావు ఎమ్.ఎస్.సి. భౌతిక శాస్త్ర అధ్యయనంతో విశ్వపరిణామంలో స్పేస్, టైమ్ రెండే కాకుండా మేధాశక్తి, బుద్ధి మరొక కొలతగా పని చేస్తుందనే సిద్ధాంతాన్ని బుద్ధి కొలతవాదం పేరిట ప్రతిపాదించారు. ఫిల్మ్, సైన్స్, చరిత్ర, సంస్కృతి, తత్వం, సామాజిక శాస్త్రాలపై ఎన్నో వ్యాసాలు రచించారు.




దిబ్బకథల పేరిట దిబ్బ ప్రభు గారితో ఇంటర్వ్యూ, దిబ్బరాజు ప్రతిష్ఠ, దిబ్బరాజ్యంలో ప్రజాస్వామ్యం, దిబ్బమ్మ, దిబ్బ పుట్టుక, దిబ్బరాజ్యంలో స్వాతంత్ర్యం పేరుతో కథలు రాయగల మేధా ప్రజ్ఞగల కొడవటిగంటి వంటి రచయిత తెలుగు సాహిత్యంలో ఇంతవరకూ లేరని నిస్సందేహంగా భావించవచ్చు.

1909 అక్టోబరు 28న జన్మించిన కొడవటిగంటి కుటుంబరావు 1980 ఆగస్టు 17న కన్ను మూసేవరకు హేతువాది అయిన సుప్రసిద్ధ తెలుగు రచయితగా తన జీవితంలో ప్రతీ కోణాన్ని అత్యంత ప్రతిభావంతంగా వివిధ ప్రక్రియలలో దర్శింపచేసారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్య ప్రయోజనం జన జీవితాలకు మేలు చేయాలని విప్లవాత్మకంగా అభిలషించి విప్లవ రచయితల సంఘ ఉపాధ్యక్షునిగా బాధ్యత నిర్వర్తించారు.

1952లో చందమామ పత్రికలో ప్రవేశించి దివంగతులయ్యే వరకు కొనసాగారు. ఆయన రచనలు అన్నీ కలిపితే వెయ్యికి పైగానే ఉంటాయి.

హేతువాద మేధావి, ఎందరికో మార్గదర్శి. తన యాభై యేళ్ల రచనా జీవితంలో పది పన్నెండు వేల పేజీలకు మించి రచనలు చేసిన సమకాలీన మానవ జీవితాన్ని పరామర్శించి, సాహితీవేత్తగా లబ్ధ ప్రతిష్ఠుడైన కొడవటిగంటి తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు.

# ఏది ప్రాధాన్యం?

**యామిజాల జగదీశ్**

ఓ పది మందిని కలిసి "మీకు జీవితంలో ఏది ముఖ్యమని?" అడిగి చూడండి.

కొందరు చెప్తారు..

"నాకు డబ్బే ముఖ్యమని.."

మరికొందరు చెప్తారు "ప్రేమ ముఖ్యమని"

ఇంకొందరు చెప్తారు "నాకు పదవే ముఖ్యమని".

మనకంటూ కొన్ని అభిప్రాయాలు తప్పకుండా ఉంటాయి. అవే మన చేతలకు మూలమవుతాయి అని అనుభవజ్ఞుల మాట.

డబ్బే ముఖ్యమని జీవిస్తున్నవారు పలువురు ఉంటారు.

అటువంటి వారికి డబ్బే సర్వస్వం. మిగిలినవేవీ పట్టవు. కంటికి ఆనవు.

బోలెడంత డబ్బు సంపాదించాలి. దానిని ఖర్చు చేయాలి. ఆ విధంగానే తమ జీవితాన్ని అమర్చుకుంటారు వారు.

వారు ప్రతిదానిని డబ్బుతోనే చూస్తారు. డబ్బుతోనే గణిస్తారు. మిగిలినవేవీ పట్టించుకోరు.

ఇంకొందరు.. వారికి ప్రేమే ప్రధానం. డబ్బు, పదవీ వంటివన్నీ ఆ తర్వాతే వారికి.


ఇటువంటివారు ప్రేమ కోసం ఏం చేయడానికైనా సిద్ధపడతారు.

మరికొందరు ఉంటారు... వారికి హోదా, గౌరవం వంటివే ముఖ్యం.

ఎలాగైనా సరే.. ప్రశంసలు పొందాలి. అదే వారి లక్ష్యమై ఉంటుంది. ప్రశంసల కోసం పొగడ్తల కోసం ఏం చేయడానికైనా సిద్ధపడతారు.

ఈ విధంగానే... ఓ మనిషి జీవితంలో ప్రతి నడవడీ ఉంటుంది.

ఓ మనిషిని అధ్యయనం చేయాలంటే అతని ప్రాధాన్యతలను పసికట్టాలి.



తనను తాను తెలుసుకోవాలంటారు కదా.. అంటే మనల్ని మనమే అధ్యయనం చేసుకోవాలి.

అది ప్రతి ఒక్కరికీ ఇది చాలా ముఖ్యం.

మనల్ని మనమే పరిశోధించుకుంటే మనల్ని మనమేమిటో తెలుస్తుంది. అదేమీ పెద్ద కష్టమేమీ కాదు.

మనమిచ్చే ప్రాధాన్యతలను బట్టే మన ఇష్టాయిష్టాలన్నీ ముడిపడి ఉంటాయి. మనం ఎలాంటి వారమనేది మనల్ని మనం అర్థం చేసుకోవాలి.

మనం ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తే తెలుస్తుంది.

మీరు డబ్బుకి ప్రాధాన్యమిస్తున్నారా?

హోదాకు ప్రాధాన్యమిస్తున్నారా?

ప్రేమకు ప్రాధాన్యమిస్తున్నారా?

ఇలాంటివి తెలుసుకున్నప్పుడు మనల్ని మనమేమిటో అంచనా వేసుకోవచ్చు.

ఎదుటివారు చెప్పక్కర్లేదు.

అంతేకాదు... మనం సమాజంలో ఉన్నాం. రోజూ మనం ఎందరితోనో మెలగుతుండాలి. తప్పదు. దీనిని దాటలేం.

ఎదుటివారి ప్రాధాన్యతలు ఏమిటో తెలిస్తే మన ప్రాధాన్యమేమిటో దాన్ని బట్టి వారితో మెలగటం సులభతరమవుతుంది. అది అర్థం చేసుకోకుంటే ఆ పరిచయం బంధం ఎక్కువ కాలం కొనసాగదు.

కానీ కొందరుంటారు.. వారు రవ్వంత కూడా అర్థం కారు.. కాబోరు. వారేమిటో ఎవరికైనా తెలుస్తుందా? అనేది ప్రశ్నార్థకమే. చాలా కఠినం.

ఒకడు లంచం తీసుకున్నాడు.

అతనికి డబ్బే ముఖ్యమనే నిర్ణయానికి వచ్చాను. కానీ దానిని అతను ఒప్పుకోలేదు.

"నాకు ప్రేమే ముఖ్యం సార్" అన్నాడు. "ప్రేమ కోసం ఏదైనా చేస్తాను" అని బల్ల గుద్దీ మరీ చెప్పాడు.

మరి అవతలి వ్యక్తి నుంచి ఎందుకు డబ్బులు ఎందుకు తీసుకున్నావని అడిగితే అతను ఏం చెప్పాడో తెలుసా?

ఆ మనిషి దగ్గరకొచ్చి "ఇదిగోనండి డబ్బు..అని ఇచ్చి వుంటే తీసుకునేవాడిని కాను. కానీ అతను ఎంతో మర్యాదగా ప్రేమగా ఇచ్చాడండి" అన్నాడు.

ఆ ప్రేమకు కట్టుబడే నేను డబ్బులు తీసుకున్నాను అని చెప్పిన వ్యక్తిని ఎలా అర్థం చేసుకోవాలో మీరే చెప్పండి.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:**

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ

డాక్టర్ దేవులపల్లి పద్మజ

**జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్ ।**
**తమోరిం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరమ్ ॥**

ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణ మూర్తిని ప్రతిరోజూ దర్శించుకునే అదృష్టం మనకి ప్రకృతి ప్రసాదించింది. ప్రణమిల్లుదాం ఉదయమే.

చంద్రుడు మఘ నక్షత్రంలో ఉండే మాసం మాఘం. 'మఘం' అంటే యజ్ఞం. అఘం అనే పదానికి సంస్కృతంలో పాపం అని అర్థం. మాఘం అంటే పాపాలను నశింపచేసేది. యజ్ఞ యాగాలకు అనువైనది. మాధవ ప్రీతికరమైనది. ప్రపంచానికి ప్రాణశక్తిని అందించే సర్వవ్యాప్తి నారాయణుడు సూర్యభగవానుడు. ఆయన సకల లోకములకు ఆత్మస్వరూపుడు. ప్రపంచానికి కాలస్వరూపుడు, గ్రహరాజు, దేవతలలో అగ్రగణ్యుడు, జ్ఞానాన్ని పంచే శివరూపుడు, మోక్షాన్ని ప్రసాదించే జనార్ధనుడు, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్నిచ్చే అగ్నిరూపుడు. అందుకే శ్రీ సూర్యభగవానుని ప్రత్యక్ష దైవంగా భావిస్తారు. సూర్యుడు లేనిదే సృష్టి లేదు, రేయింబవళ్లుండవు. కాలానికి కాలమానం సూర్యమానం. సకల చరాచర సృష్టికి, జీవరాశి మనుగడకు సూర్యశక్తి తప్పనిసరి. భాస్కరుడు ఈ మండలాన్ని ప్రకాశింపచేస్తాడు. సూర్యుడు జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, శబ్ద, రస, రూప గంధాలుగా ప్రపంచానికి ఆపద్బాంధవుడయ్యాడు. సూర్యుడు సర్వ దిక్కులకు వ్యాపించి సర్వ శుభాలను, దీర్ఘాయువును ప్రసాదిస్తాడు. సూర్యభగవానుడు భూమి నుండి 14.98 కోట్ల కిలోమీటర్ల ఎత్తులో ఉంటాడు. సూర్యకిరణాలు సెకనుకు 3 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. అవి భూమిని చేరటానికి 8 నిమిషాలు పడుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు అంచనా వేస్తారు.

సూర్య సంచారాన్ని అనుసరించి ఉత్తరాయనం, దక్షిణాయనంగా సంవత్సర కాలాన్ని విభజించవచ్చు. మకరం నుండి మిథున రాశి వరకు గల సూర్య సంచారాన్ని ఉత్తరాయన పుణ్యాకాలంగా భావిస్తారు. ఈ కాలం ఎంతో శుభప్రదమైనదని, ఆరోగ్యకారకమని, మోక్షప్రదాయకమని చెబుతారు. ఉత్తరాయన కాలంలో మరణం సంభవిస్తే సూర్యమండలం ద్వారా ఉత్తమ లోకాలకు జీవి చేరుతుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. అందుకే భీష్మపితామహుడు శరతల్పగతుడై ఉత్తరాయనం వచ్చేవరకు వేచి వుండి దేహత్యాగం చేసాడని శాస్త్రాలు చెబుతున్నాయి. సూర్యోపాసన ప్రాముఖ్యాన్ని రామాయణ కాలంలోకూడా వివరించటం జరిగింది. మహర్షి విశ్వామిత్రుడు ఆవిష్కరించిన గాయత్రి మంత్రమే సూర్యోపాసనగా కొందరు భావిస్తారు. అగస్త్య మహర్షి ద్వారా ఆదిత్య హృదయాన్ని స్వీకరించిన శ్రీరాముడు రావణ సంహారం చేసినట్లుగా రామాయణం వివరిస్తోంది.



సర్వ దేవతా సమాహారమే సూర్యభగవానుడని అందరూ విశ్వసిస్తారు. **"ఆది దేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కరా.. దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే"** అంటూ దివాకరుని ప్రతిరోజూ సేవించేవారికి అన్ని రకాల దీర్ఘ రోగాలు మటుమాయం అవుతాయి. సూర్యకిరణాలలో అనంతమైన శక్తి నిబిడీకృతమై ఉంది. సూర్యకాంతి మన కంటికి శ్వేత వర్ణంలో కనిపించే సప్తవర్ణ కారకం. ఆంగ్లంలో విబ్జియార్ అంటారు. అంటే ఉదారంగు అని అర్థం. సూర్యకాంతిలో సప్త వర్ణాలు కనిపిస్తాయి. ఆ రంగునే సప్తాశ్వాలుగా మహర్షులు పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. గాయత్రి, త్రిష్టుప్పు, అనుష్టుప్పు, జగతి, పంక్తి, బృహస్పతి, ఉష్ణిక్కు అనేవి సూర్య రథ అశ్వ నామాలుగా పేర్కొంటున్నారు. దినకరుని ద్వాదశ నామాలను ద్వాదశ మాసాలుగా వ్యవహరిస్తారు. ద్వాదశాదిత్యునిగా పిలువబడే సూర్యభగవానున్ని చైత్రంలో ధాత, వైశాఖంలో ఆర్యముడు, జ్యేష్టంలో మిత్రుడు, ఆషాఢంలో వరుణుడు, శ్రావణంలో ఇంద్రుడు, భాద్రపదంలో వివస్వంతుడు, ఆశ్వీయుజంలో త్వష్ట, కార్తికంలో విష్ణువు, మార్గశిరంలో తర్యముడు, పుష్యంలో భగుడు, మాఘంలో పుషుడు, ఫాల్గుణంలో క్రతువుగా సూర్యోపాసకులు కొలుస్తారు.

చన్నీటి స్నానం చేసేవారి ఆరోగ్యం బాగుంటుందని అందరికీ తెలుసు. దీని వెనుక సూర్యుని ప్రభావం ఎంతో ఉంది. సూర్యకిరణాల తాకిడికి నీరు తేజస్సుగా సంతరించుకుంటుంది. ఎవరైతే చన్నీటితో స్నానం చేస్తారో వారు ఆ తేజస్సును అనుభవించగలుగుతారు. సూర్యుని లేలేత కిరణాలు మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ విషయాన్ని విజ్ఞాన శాస్త్రం కూడా అంగీకరించింది. ప్రసవానంతరం శిశువుకు కామెర్లు సంభవిస్తే ప్రతిరోజూ సూర్యోదయ కాలంలో పది నిమిషాలు చొప్పున పది రోజులు ఉంచినట్లయితే వ్యాధి తగ్గుముఖం పడుతుందని శిశు వైద్యులు చెబుతారు.

సూర్యుడు లేనట్లయితే భూమిపై జీవరాశి మనుగడ ఉండదు. జీవరాశికి కావలసిన అన్ని రకాల అవసరాలు తీర్చి ఈ భూమండలాన్ని కాపాడుతున్నాడు. అందుకే ఆ దినకరుని ఆరాధన ఆచారంగా వస్తోంది. సూర్యభగవానుడు ప్రతిరోజూ దర్శనమిస్తూ ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్నాడు.

దినకరుడు రెండు, మూడు రోజులు దర్శనమివ్వకపోతే లోకాలు తల్లడిల్లిపోతాయి. సూర్యుని మూడు దశలైన సూర్యోదయం, మధ్యాహ్నం, సూర్యాస్తమయం సృష్టి, స్థితి లయలుగా పోలి ఉంటాయి.

సూర్యుని నుండి వచ్చే కిరణాలు సప్త జ్ఞాన భూమికలు. అందులో జ్ఞానం ప్రధానమైనది. వాటి నామాలను పరిశీలిస్తే శుభేచ్ఛ, విచారణ, తనుమానసం, సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థభావని, తురీయంగా తెలుస్తుంది. బ్రహ్మ జ్ఞానం కావాలనే ఇచ్ఛను శుభేచ్ఛ అని, బ్రహ్మ జ్ఞానాన్ని పొందే సాధనా మార్గ మీమాంసను విచారణ అని, సాధనా మార్గంలో నిమగ్నమై ఉండటాన్ని తనుమానసం అని, రజో గుణ, తమో గుణ రహితమైన శుద్ధ సాత్విక శూన్య స్థితిని సత్త్వాపత్తి అని, తనువు, సంసారం పట్ల తటస్థ స్థితి కలిగి దివ్య చక్షువులు ఉత్తేజితమయ్యే స్థితిని అసంసక్తి అని, దివ్య చక్షువుల ద్వారా పదార్థ భావన కలిగి వుండి కూడా పూర్తి సంశయ నివృత్తి కాక ఉండే స్థితిని పదార్థ భావన అని, సాధన ద్వారా పూర్ణ వికాస స్థితిని చేరుకుని సిద్ధుడుగాను, బుద్ధుడుగానూ రూపాంతరం చెందే ఆఖరి స్థితిని తురీయం అని అంటారు. దీనినే నిర్వికల్ప సమాధి స్థితి అని కూడా అంటారు.

రోహిణీ నక్షత్రంలో, ఆదివారం, మాఘ శుద్ధ సప్తమినాడు సూర్యభగవానుడు జన్మించాడు. ఈయన తండ్రి కశ్యప ప్రజాపతి. సంజ్ఞ, ఛాయ ఈయన భార్యలు. యమధర్మరాజు, శనీశ్వరుడు ఈయన కుమారులు. జల ప్రళయానంతరం వైవస్వత మనువుకు సప్త అశ్వాలతో కూడిన రథంలో సూర్యభగవానుడు దర్శనమిచ్చే రోజునే 'రథసప్తమి' అని వ్యవహరిస్తారు అని సూర్య పురాణం తెలియచేస్తోంది. ఆదివారం రథసప్తమి వస్తే మహాయోగమనే చెప్పాలి. మాఘ శుద్ధ షష్టినాడు ఉపవసించి, సప్తమినాడు సూర్యోపాసన చేస్తే జన్మజన్మాంతర పాపాలు నశిస్తాయి. రథసప్తమినాడు జిల్లేడు ఆకును, రేగుపండ్లను తలపై ఉంచుకుని శిరస్సుపై నుంచి స్నానం ఆచరించాలి. తరువాత కింద వివరించిన మంత్ర జపం చేస్తూ అర్ఘ్య ప్రదానం చేయాలి.

**"జననీ త్వంహి లోకానాం సప్తమీ సప్తసప్తికే ।**

**సప్తమ్యా హ్యదితే దేవి నమస్తే సూర్యమాత్రుకే ॥**

తరువాత తగిన విధంగా పితృ తర్పణాలు సమర్పించి ఎరుపు రంగు పాత్రలో చిమ్మిలిని ఉంచి, ఎరుపు రంగు వస్త్రాన్ని కప్పి, ఎరుపు రంగు తామర పూవులతో, అక్షతలతో బ్రాహ్మణులకు దానమివ్వాలి. చిక్కుడు కాయలతో రథం తయారు చేసి, అందులో సూర్యప్రతిమను నిలిపి, యథాశక్తి అర్చించి చిక్కుడు ఆకులో ఆవుపాలతో తయారు చేసిన బియ్యపు పాయసాన్ని నివేదన చేయాలి. తరువాత చిక్కుడు ఆకులోనే అందరూ ఆ పాయసాన్నే ప్రసాదంగా స్వీకరించాలి. ఈరోజు తైల పదార్థాలు నిషిద్ధం. భవిష్యోత్తర పురాణంలో శ్రీకృష్ణ భగవానుడే స్వయంగా సూర్యోపాసన ప్రాముఖ్యాన్ని ధర్మరాజుకు వివరించాడు. సూర్యభగవానుని అనుగ్రహానికై ఈరోజు చేసే పూజకు, ఉపాసనకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. శ్రీమన్నారాయణుని రెండు కనులు సూర్య, చంద్రులుగా పేర్కొంటారు. అందుకే సూర్యుని కిరణాలు శ్రీమన్నారాయణుని కరుణా కటాక్ష వీక్షణాలుగా భావించి ఆరాధిస్తారు. రథసప్తమినాటి నుండి చలి తగ్గుముఖం పడుతుంది. వేడి క్రమంగా అధికమవుతుంది. అందుకే పూర్వ కాలంలో రాజులు రథసప్తమి నాటి నుండి యుద్ధాలకు సన్నద్ధమయ్యేవారు. అందుకు సూచనగా రథాలను సిద్ధం చేసుకునేవారు. సూర్యరశ్మి లభ్యత పెరిగి పంట దిగుబడి కూడా పెరుగుతుంది.

సూర్యగ్రహ అనుకూలత ఉన్నట్లయితే జీవితంలో సంపూర్ణ ఆరోగ్యం, వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో అభివృద్ధి గోచరిస్తుంది. వ్యక్తులు వీరోచితంగా మారతారు. ప్రభుత్వ సంబంధ కార్యక్రమాలలో అనుకూలత సిద్ధిస్తుంది. ప్రజా బాహుళ్యంలో పేరు ప్రఖ్యాతులు సంభవిస్తాయి. అధికార ప్రాప్తి కలుగుతుంది. రవి వ్యతిరేకంగా ఉన్నట్లయితే వీటి వ్యతిరేక ఫలితాలు కలుగుతాయి. దేవాలయంలోని సూర్యగ్రహం వద్ద ఆదివారం ఎరుపు రంగు 6 వత్తులతో దీపారాధన, ఎరుపు రంగు వస్త్రం దానం, సూర్య ధ్యాన శ్లోకం ప్రతిరోజు 60 మార్లు చొప్పున 60 రోజుల పారాయణ, రథసప్తమి రోజున సూర్యాష్టకం 6 సార్లు పారాయణం, బ్రాహ్మణునికి గోధుమలు దానం, పేదలకు చపాతీలు దానం వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలనిచ్చి రవిగ్రహ వ్యతిరేకత తగ్గిస్తుంది.

అరసవెల్లిలోని సూర్యదేవాలయం కళింగరాజు 7వ శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రకంగా తెలుస్తోంది. ఇక్కడ అద్భుతమైన శిల్ప సౌందర్యం గమనించవచ్చు. ప్రతిరోజూ ఉదయం సూర్య కిరణాలు స్వామి విగ్రహం పాదాలను తాకటం, ఈ దేవాలయ నిర్మాణ కౌశల్యాన్ని తెలియచేస్తుంది. ఒడిస్సాలోని కోణార్క్‌లో అద్వితీయమైన సూర్యదేవాలయం ఉన్నది. ఇది 13వ శతాబ్దంలో నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడ 100 అడుగుల ఎత్తైన సూర్యరథం ఏక శిలపై నిర్మించారు. తన రెండు చేతులలో పద్మాన్ని ధరించిన సూర్యుడు, రథ చక్రాలు, అశ్వాలు అతి స్పష్టంగా నిజాకృతిని దాల్చినట్లు గోచరమౌతుంది. ఈ దేవాలయం అనేక పర్యాయాలు ముస్లిం దండయాత్రలకు గురైంది. మన దేశంలో అనేక సూర్య దేవాలయాలున్నాయి. సాధారణంగా ప్రతీ శివాలయంలో నవగ్రహ దేవతలు దర్శనమిస్తారు. మిగిలిన గ్రహాలు పరివేష్టింపగా సూర్యుడు మధ్యలో ప్రకాశిస్తూ గోచరిస్తాడు. తూర్పు గోదావరి జిల్లాలోని పెద్దాపురం, కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం, కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు, తమిళనాడులోని కుంభకోణంలో ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి.



జీవకోటి మనుగడకు ఆధార భూతమైన శ్రీ సూర్యనారాయణునికి ప్రీతిపాత్రమైన రథసప్తమినాడు ఆరాధించి అందరం సకల శుభాలను పొందుదాం. ■



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఆర్థిక వనరులను సమకూర్చుకోవడానికి అవిశ్రాంతంగా శ్రమిస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది. కుటుంబ సభ్యులతో స్పర్థలు చోటు చేసుకునే సూచనలున్నాయి. కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు తొందరపాటు కూడదు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పరంగా చెప్పుకోదగిన మార్పులేవీ చోటు చేసుకోవు. క్రయ-విక్రయాల్లో లాభాలుంటాయి.

## వృషభం



శుభా శుభ మిశ్రమంగా ఒటుంది. దేవాలయాలు సందర్శిస్తారు. సకుటుంబంగా శుభ కార్యాలలో పాల్గొంటారు. వ్యక్తిగత విషయాలలో ఇతరుల మితిమీరిన జోక్యం అసహనానికి గురి చేస్తుంది. ఎవరినీ ఏమీ అనలేని నిస్సహాయత చోటు చేసుకుంటుంది. ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. సంతాన విద్యా విషయాల పైన దృష్టి కేంద్రీకరిస్తారు.

## మిథునం



నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. నిరుద్యోగులకు ఊరట కలిగించే పరిణామాలు చోటు చేసుకుంటాయి. ప్రతి పనిలోనూ శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. మంచి వ్యక్తిగా ముద్ర వేసుకోవడానికి అన్ని రకాలుగా కృషి చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. సుదూర ప్రాంత విషయాలు లాభసాటిగా ఉంటాయి.వ్యక్తిగత గౌరవం పెరుగుతుంది.

## కర్కాటం



మానసిక ప్రశాంతతకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. ఉన్నత స్థాయివారితో స్నేహ సంబంధాలు బలపరచుకుంటారు. అనుకూలమైన అధికార పత్రం ద్వారా లాభపడతారు. దూర ప్రాంత ప్రయాణాలు ఒకే సమయంలో అనేక పనులను సానుకూల పరచుకోవాల్సి వస్తుంది. దైవం మీద భారం వేసి మీ శక్తికి మించి పెట్టుబడులు పెడతారు.

## సింహం



ప్రతి విషయంలోనూ నిదానంగా వ్యవహరించడం మంచిది. మానసిక ప్రశాంతత కోసం యోగా చేయడం మంచిది. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. కార్యాలయాలు, వ్యాపార కేంద్రాలలో స్వల్ప ఒడుదుడుకులు ఏర్పడతాయి. నిర్మాణాత్మకమైన వ్యవహారాలలో పురోభివృద్ధి కనిపిస్తుంది. సంతాన విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసి ఉంటుంది.

## కన్య



ఆర్థికాభివృద్ధిని సాధించడానికి వినూత్నమైన ఆలోచనలు అమలు చేస్తారు. సమర్థవంతమైన పనివారిని సమకూర్చుకోవడం వలన వ్యాపారస్తులు లాభపడతారు. స్త్రీలతో ఏర్పడ్డ విభేదాలు తొలగిపోతాయి. కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తారు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. మీ నడవడికలో స్వల్ప మార్పులు చేస్తారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

## తుల



స్థిరాస్తిని వృద్ధి చేసుకోవడానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. అవిశ్రాంతంగా శ్రమించి సానుకూల ఫలితాలు సాధిస్తారు. జీవిత భాగస్వామితో స్వల్పమైన విభేదాలు చోటు చేసుకునే సూచనలున్నాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా బాధ్యతలు పెరుగుతాయి. క్రయ-విక్రయాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. మీరు ఇతరులకు ఇచ్చిన వాగ్దాలను సకాలంలో నిలబెట్టుకుంటారు. శుభ కార్యాలు నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు.

## వృశ్చికం



దూర ప్రాంత ప్రయాణాలు చేసే సూచనలున్నాయి. కార్యాలయాలలో స్వయంకృతాపరాధాలు చోటు చేసుకున్నప్పటికీ ఒడుదుడుకులేమీ ఉండవు. ఆదాయ, వ్యయాలలో సమతుల్యత లోపించకుండా చేసుకోవడం అవసరం. పొదుపు పైన దృష్టి సారిస్తారు. సంతాన పురోభివృద్ధి మానసిక ప్రశాంతత కలిగిస్తుంది. శుభ వార్తలు వింటారు. అన్ని అనుకూలంగా వున్నప్పటికీ మానసిక సంఘర్షణ చోటు చేసుకుంటుంది.

## ధనుస్సు



ఆర్థికంగా బాగుంటుంది. తీర్థయాత్రలు చేస్తారు. ప్రతి పని విజయవంతంగా పూర్తి చేయడానికి ముందుచూపుతో వ్యవహరిస్తారు. ఖర్చుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించండి. వృత్తి, ఉద్యోగాల పరంగా సానుకూల ఫలితాలు సాధిస్తారు. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. విదేశీ విద్య, ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి. ప్రత్యర్థి వర్గంలోని కొందరు మీతో స్నేహ సంబంధాలు పెంచుకుంటారు. ఈ పరిణామం ఆశ్చర్యం కలిగిస్తుంది.

## మకరం



సాధారణ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఉద్యోగ పరంగా అధికంగా శ్రమించినప్పటికీ అంతంత మాత్రపు ఫలితాలు ఉంటాయి. కోర్టు కేసులు వాయిదా పడతాయి. కొంత ఆత్మన్యూనతా భావానికి లోనవుతారు. ఒక సందర్భంలో స్వయం కృతాపరాధాల వల్ల తాత్కాలిక ఇబ్బందులు ఎదురవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మీ సలహాలు, సూచనలు అందరి మన్ననలు అందుకుంటాయి. పనులలో చురుకుదనం లోపిస్తుంది.

## కుంభం



కుటుంబ విషయాలు అనుకూలంగా ఉంటాయి. వివాదాస్పద అంశాలు సానుకూల పడతాయి. సంస్థలను విస్తరింపచేసుకునే యత్నాలు కలిసి వస్తాయి. ఉద్యోగులకు పదోన్నతి/బదిలీ సూచనలు గోచరిస్తున్నాయి. మితిమీరిన ఆత్మ విశ్వాసం వల్ల చిక్కులు రాకుండా జాగ్రత్తలు వహించండి. సలహాలు, సూచనలు ఇచ్చేవారు అధికమవుతారు.

## మీనం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. సులువుగా అవుతాయనుకున్న వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. వైరాగ్యం, వేదాంతం చోటు చేసుకుంటాయి. సంతానం వల్ల ప్రఖ్యాతి లభిస్తుంది. మిత్రులు సహాయ, సహకారాలు అందిస్తారు. వ్యాపారాలలో లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. వాహనం మార్పు చేయాలన్న ఆలోచనలు బలపడతాయి. కొన్ని విషయాలలో మొండిగా ప్రవర్తిస్తారు.

# నుయ్యి ఎటు వైపు తవ్విస్తే మంచిది?

**వాస్తువార్త**


వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458




కె.సాయిలత – ఎమ్మిగనూరు

**ప్రశ్న: కొత్తగా నుయ్యి తవ్వించాలని అనుకుటున్నాం. ఇంటి నమూనాని చూసి నుయ్యి ఎక్కడ తీస్తే వాస్తు ప్రకారం బాగుంటుందో తెలుపగలరు.**

**జవాబు:** ఇంటి ఈశాన్య మూల నుండి ప్రహరీ ఈశాన్య మూల వరకు ఒక తాడు పట్టి నేరుగా లాగండి. అక్కడ తాడుపై నుండి నేల మీద ముగ్గు పోయండి. ఇంటి ఉత్తరం గోడ నుండి పారుగా తాడును నేరుగా తూర్పు కాంపౌండు గోడ వరకు తాడు లాగి ముగ్గు పోయండి. అలాగే ఇంటి తూర్పు గోడ నుండి బారుగా తాడును ఉత్తరం కాంపౌండు గోడవరకు లాగి ముగ్గు పోయండి. అప్పుడు ఈశాన్యంలో రెండు త్రిభుజాలుగా ముగ్గు ఏర్పడుతుంది. మీరు వీలుననుసరించి ఏ త్రిభుజాకారంలోనయినా బావి తవ్వవచ్చు. బావి ఆ ముగ్గు పైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోండి.

## ఏమేం మార్పులు చేయాలి?

ఎస్.శ్రీకర్ – కాకినాడ

**ప్రశ్న: ఉత్తరం గదిని పూజగదిగా వాడుతున్నాం. దక్షిణం గదిని పడక గదిగానే వాడుతున్నాం. మార్పులేమయినా చేయవలసి వుంటే చెప్పగలరు.**

**జవాబు:** మీ ఇంటి కాంపౌండు గోడలు సరిగ్గానే వున్నప్పటికీ ఇంటిని మాత్రం పశ్చిమ వాయవ్యం పెంచి కట్టినట్టు ప్లానులో వుంది. ఎందుకలా కట్టారో బోధపడలేదు. ఇంటిని రెండు పోర్షన్లుగా కట్టారు. దక్షిణం వైపున వున్న పోర్షన్‌కి గుమ్మాలు తూర్పు ఈశాన్యం నుంచి పశ్చిమ వాయవ్యానికి నడకను సాగించేవిగా వున్నాయి. మంచిదే! కానీ ఉత్తరం వైపున కట్టిన పోర్షన్ గుమ్మాలు మాత్రం తూర్పు ఆగ్నేయం నుండి పశ్చిమ నైరుతి వైపు నడకను సాగించేవిగా వున్నాయి. ఈ నడక మంచిది కాదు. ఈ పోర్షన్ తలుపులను కూడా ఇతర పోర్షను తలుపుల్లాగా మార్చి అమర్చుకోవలసి ఉంటుంది. గుమ్మాలు, కిటికీలు కూడా ఏడేసి వున్నాయి. ఇవికాక మరో గుమ్మం, కిటికీ నిర్మించటం కానీ ఒక్కో గుమ్మం, కిటికీ తగ్గించటంగానీ చేయాలి. ఈ చిన్న మార్పులు చేసి చూడండి. తూర్పు, ఉత్తరాల్లో చాలా ఖాళీ స్థలం వుంది. తూర్పున బావి వుంది కనుక మీకు చాలా మంచి ఫలితాలు కనిపిస్తాయనటంలో సందేహం లేదు.

## వంట ఆగ్నేయంలోనే చేయాలా?

ఎం.పాండురంగ – కర్నూలు

**ప్రశ్న: ఏ గదిలోనయినా ఏ దిక్కునైనా ఆగ్నేయ మూలలో వంట పెట్టవచ్చా? దక్షిణ ఆగ్నేయంగా వాడుక నీటిని బయటకు పంపవచ్చా?**

**జవాబు:** ఒక్క ఈశాన్య దిక్కులో తప్ప మిగతా మూడు దిక్కుల్లోని గదుల్లో అంటే– ఆగ్నేయ, నైరుతి, వాయవ్య మూలల్లోని గదుల్లో ఆగ్నేయ మూలలో వంట చేయవచ్చు. ఆగ్నేయ గదిలో ఆగ్నేయ మూల సర్వదా శ్రేష్టం. కానీ అక్కడ వంట చేయడానికి వీలుపడని పక్షంలో నైరుతి, వాయవ్య గదుల్లో ఆగ్నేయ మూల వంట చేసుకోవచ్చు

ఒక ఇంటికి మూడు వైపులా ఇళ్లు వుండి కేవలం దక్షిణంలో మాత్రమే వీధి వుంటే వాడుక నీరు దక్షిణ దిశగానే మళ్లించి అటు రోడ్డు పక్కనున్న డ్రైనేజీ లైనుకు కలుపవలసి ఉంటుంది. దక్షిణం, దక్షిణ నైరుతి నుండి నీరు బయటికి పోవటం వాస్తు ప్రకారం మంచిది కాదు. కాబట్టి దక్షిణ ఆగ్నేయం గుండా నీటిని బయటకు తూము ద్వారా పంపించవచ్చు.



## వాస్తు అవసరమా?

ఎస్.చాముండేశ్వరి – హైదరాబాద్

**ప్రశ్న: ఇప్పుడు మారుతున్న సమాజంలో అపార్టుమెంటులు వాస్తు చూడకుండా కొనుక్కుంటున్నారు చాలా మంది. ఇంటి వాస్తు ముఖ్యమా?**

**జవాబు:** అపార్ట్‌మెంట్స్‌లో కూడా వాస్తు అవసరమే. అపార్ట్‌మెంట్స్ నిర్మాణంలో వుండగానే నన్ను తీసుకువెళ్లి కావలసిన పద్ధతిలో నిర్మాణ క్రమంలో తలుపులు మొదలయినవి ఏర్పాటు చేసుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

## దోషాలున్నాయా?

ఎన్.కరుణాకర్ – కొత్తపేట

**ప్రశ్న: మా గృహంలో ఎలాంటి దోషాలున్నాయో తెలుపగలరు.**

**జవాబు:** మీ ఇంటికి తూర్పు ఆగ్నేయ వీధిపోటు దోషం స్పష్టంగా కనిపిస్తున్నది.

## స్థలం కొనవచ్చా?


ఎస్.ప్రభావతి – మహబూబ్‌నగర్

**ప్రశ్న: మీరు రచించిన వాస్తుభూమి ద్వారా వాస్తు శాస్త్ర రహస్యాలు తెలుసుకున్నాం. ఉత్తర ఈశాన్య వీధిపోటు మంచిదని అందులో వుంది. పడమటి కాంపౌండు వెంబడి జాగా కొనటానికి సిద్ధంగా వుంది. కొనుక్కోవచ్చా?**

**జవాబు:** ఇంటికి పడమర భాగంలో వున్న ఖాళీ స్థలం కొనుక్కోటం శ్రేయస్కరం కాదు. ఇంటికి పడమర ఖాళీ స్థలం ప్రస్తుతం తక్కువగానే ఉంది. కొత్తగా కొని కలుపుకోవటం వలన తూర్పున వున్న ఖాళీ స్థలం కంటే పడమర ఎక్కువ అవడం వలన చెడు పరిణామాలు ఏర్పడతాయి.

# పదరంగం-25

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. విద్య లేనివాడు ... అని సామెత (5)
3. ప్రాణం ఉన్నది (2)
4. సూదంటు రాయి (4)
6. గుర్తు లేకపోవుట (5)
7. ఇది 'కొడితే' వింటున్నట్లు (1)
8. పన్నులు రాబట్టు అధికారి (4)
10. తెలుగులో మార్బుల్ (5)
12. రంగు వేయు, అదుము(అటు నుంచి) (2)
14. వినసొంపుకాని కలకల ధ్వని (2)
15. అటునుంచి భద్రం (3)
17. వేగం సరిగా లేదు (3)
18. తిరగబడ్డ జండా (3)
19. అల్లరి (2)
20. చీకటి పడితే ఎగిరేది (3)
22. మొదటి బేరం (2)
23. ఈ పక్షికి అంతులేదు (2)
24. నవరాత్రి పండుగలను కలిపి ఇలా అంటారు (3)
25. ఈ ఊరి వర్ణ చిత్రాలు ప్రసిద్ధి (4)

### నిలువు

1. విసనకర్ర (4)
2. ఎకసెక్కాలు (5)
3. నెలవారీ ఆదాయం (2)
5. ఒంటి జిడ్డును పోగొట్టే కాయ తలకిందులైంది (3)
8. దాచి పిల్లలకిచ్చే తినుబండారం (3)
9. మర్దించు, తోము (2)
10. 64 గళ్ల ఆట (4)
11. వేసవిలో చల్లదనం కోసం దీని చాపలను కడతారు (4)
13. అన్నీ కలుపుకుని, వెరసి (5)
16. సిపాయిల దళం (3)
19. కష్టం, సమస్య (3)
20. ఒక విద్యాశాస్త్ర విషయం (3)
21. కలంలో పోసి రాసేది (2)
23. విధం, విధానం (2)

## పదరంగం-23 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మొ[1] | క్కు | బ[2] | డి | | | ఆ[3] | ప్యా | య | త[4] |
| ట్టే | | డ | | అ[5] | త్యా | శ | | | న్మ |
| కా[6] | పా | లి | కు | డు | | | ఆ[7] | దా[8] | యం |
| య | | క | | గు[9] | బు | రు[10] | | ప | |
| | నం[11] | | | బో | | స | | రి | |
| ఆ[12] | మా | య | కు | డు | | ప[13] | సి[14] | కం | దు[15] |
| | ను | | | గు[16] | ల్ల[17] | | పా | | స్స |
| | ఆ[18] | స[19] | లు | | పు | | యి[20] | డా[21] | ల |
| కం[22] | | ర | | కా[23] | ప | రి | | ల | |
| చి[24] | రా | కు | | | వే | | ప[25] | రు | వు |

### పదరంగం-23కి జవాబులు పంపించినవారు

1. యం.వి.రమణకుమారి-హైదరాబాద్; 2. గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడ్-రాజంపేట; 3. సి.జి.శంకరరావు-ఎ.ఎస్.రావ్ నగర్, హైదరాబాద్; 4. వి.సంధ్యారాణి-సికిందరాబాద్;

జవాబులు పంపించాల్సిన చిరునామా:


**పదరంగం** ఆదివారం వార్త, నం.396,


లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.


పేరు : ................................................................

................................................................

ఊరు : ................................................................


నీవు ఫ్రీ బస్సుల్లో వచ్చేయి.. నేను ఫ్లైట్‌లో వస్తా! సరేనా?
Zakir...


హెచ్చరిక
రానున్నది సెల్ ఫోన్ దారులు
రోడ్లపై సంచరించు నగరం..వారికి
కనిపించదు, వినిపించదు... ఆగి,
చూసి, నెమ్మదిగా వెల్లుము ..
HYD
Zakir...


ఒక్క శాటిలైట్ ఛానల్ కన్నా 32 యూట్యూబ్ ఛానెల్స్ మిన్నన?!

# ఈ వారం కా'ర్టూన్స్'





సంవత్సరం పొడవునా పర్యాటకులతో సందడిగా ఉండే గ్రామం శిరకావాగో. జపాన్‌లో ఉందీ ఈ ఊరు. గ్రామం చుట్టూ కొండలు, అడవులు, నదీపాయలు, వరిపొలాలతో పచ్చగా పైరులతో అలరారుతూ ఉంటుంది. యునెస్కో గుర్తింపు పొందిన ఈ ఊరు అన్ని కాలాల్లోనూ సందర్శకులను ఆకర్షిస్తుంది.









